

ఈనాడు
తిరుపతి
సోమవారం ఆగస్టు 31, 2026 5

సీఎం హాజరు.. పెళ్లింట సందడి రెట్టింపు


వరుడికి మాంగల్యాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు నాయుడుకు శ్రీకాళహస్తిలో ఆదివారం ఘనస్వాగతం లభించింది. సీఆర్ఎస్‌కండ్రిగలోని హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రికి శ్రీకాళహస్తీశ్వరాలయ వేదపండితులు ఆశీస్సులు అదించి తీర్థప్రసాదాలను అందజేశారు. సీఎస్ఎన్ కన్వెన్షన్ హాలు వద్ద శాప్ మాజీ ఛైర్మన్ దివంగత పి.ఆర్.మోహన్ సతీమణి ఇందిర, కుమారుడు నైమిత్‌లతోపాటు పలువురు నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వివాహ సమయంలో జీలకర్ర, బెల్లం తంతు ముగించి నిరీక్షిస్తున్న వరుడు రాజేష్‌కు ముఖ్యమంత్రి మాంగల్యాన్ని అందజేసి ఆశీర్వదించారు. పి.ఆర్.మోహన్ కుటుంబీకులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం బయలులేది వెళ్లారు. ముఖ్యమంత్రి రాకతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


హెలిపాడ్ వద్ద ప్రసాదాల బ్యాగు అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బి.కె.వెంకటేశులు

అరుదైన జూ పార్కుకు.. బృహత్తర చూపు

- 1254.71 హెక్టార్లలో విస్తరణ
- శాసనసభ కమిటీ కీలక సిఫార్సులు

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల విస్తీర్ణపరంగా ఆసియాలో అతిపెద్దది. శేషాచల పర్వతాలకు దిగువన 1254.71 హెక్టార్లలో జూపార్కు ఏర్పాటైంది. అయితే ప్రస్తుతం ఉన్న వన్యప్రాణుల నివాస స్థావరాలు, మౌలిక సదుపాయాలు కేవలం 289 హెక్టార్ల పరిధిలోనే ఉన్నాయి. ఇందులోనే 84 రకాలకు చెందిన 1,100 వన్యప్రాణులు, పక్షులు మనుగడ సాగిస్తున్నాయి. మిగిలిన 965.71 హెక్టార్ల భూమి ఖాళీగా ఉంది.

రూ.6 కోట్లు తక్షణం అవసరం

తాజాగా ఏపీ వన్యప్రాణులు, పర్యావరణ కమిటీ సిద్ధం చేసిన ప్రతిపాదనల నేపథ్యంలోనైనా కొత్తకళ సంతరించుకోవడంపై అంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఛైర్మన్‌గా వ్యవహరిస్తోన్న ఈ కమిటీ గతనెల 16 తేదీన జూపార్కును సందర్శించి కీలక సూచనలు చేసింది. సింగ్‌పూర్ నిపుణుల సాయంతో అభివృద్ధికి చర్యలు చేపడతామని చెప్పింది. జూపార్క్ అభివృద్ధికి తక్షణం రూ.6 కోట్లు అవసరమని గుర్తించి ఇందులో రూ.3 కోట్లు తితిదే నుంచి సమీకరించాలని, మిగిలిన రూ.3 కోట్లను కలెక్టర్ సీఎస్ఐఆర్ నిధుల ద్వారా సేకరించాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే, ఎంపీల ద్వారా మరింత నిధులు సమకూర్చే ప్రయత్నం చేస్తామన్నారు.

కీలక ప్రతిపాదనలు



- అనుమతించిన మేర అడ్వెంచర్, ఎంటర్‌టైన్‌మెంట్ పార్కుల ఏర్పాటు.
- 13 కిలో మీటర్ల మేర కూలిపోయిన ప్రహరీ పునర్నిర్మాణం.
- అభివృద్ధికి అవసరమైన నిధులు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించేలా కృషి.
- కల్యాణి జలాశయం నుంచి నీటి కేటాయింపులు.
- జంతువులకు అవసరమైన రక్షితనీటి ఫిల్టర్ల ఏర్పాటు.
- మంజూరైన పోస్టుల భర్తీకి చర్యలు.
- సుస్థిర ఆదాయ వనరుల ఏర్పాటు.
- పునుగు పిల్లుల విశిష్టత తెలియజేసేలా కేంద్రం ఏర్పాటు.
- ఎర్రచందనం ఎక్స్‌పీరియన్స్ సెంటర్, విక్రయ కేంద్రం ఏర్పాటు.
- ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులు నడపడం.

గతంలోని ప్రణాళికలు ఇలా..

2009-14లో అప్పటి ప్రభుత్వం రూ.100 కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించింది. నైట్ సఫారీ, మోనోట్రైన్ ఏర్పాటు, వైట్ టైగర్ సఫారీ, డీర్ సఫారీ, తీగల వంతెనల నిర్మాణం చేపట్టాలని రోడ్డుమ్యాప్ సిద్ధం చేశారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. తర్వాత అనేక ప్రణాళికలు తెరపైకి తెచ్చినా అమలుకు నోచుకోలేదు.

తిరుమలకు వచ్చేవారిలో 4% రాక

వేంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుపతి, తిరుమలకు 70వేల నుంచి లక్ష మంది వరకు వస్తుండగా వారిలో 4 శాతంమంది మాత్రమే జూకు వస్తున్నారని, దీన్ని 8 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. టాయ్ ట్రైన్ల ఏర్పాటు, ఫుడ్ కోర్టులు, అడ్వెంచర్, మిమిక్రీ వంటి కార్యక్రమాల ఏర్పాటుతోపాటు వివిధ భాషల్లో మాట్లాడగలిగిన గైడ్‌లను నియమించడం ద్వారా సందర్శకులను ఆకర్షించడం. కమిటీ సూచనలు, ప్రతిపాదనల్లో 50 శాతం అమల్లోకి వచ్చినా జూ దశ, దిశ మారుతుందన్న అభిప్రాయం జంతుప్రేమికుల నుంచి వ్యక్తమవుతోంది.

రూ.3 కోట్లు.. ఏమైనట్లు?

- ఎన్‌హెచ్ పనులకు పెద్దఎత్తున మట్టి తరలింపు
- జలవనరుల శాఖకు చేరని రాయల్టీ

చిట్టమూరు, న్యూస్‌టుడే: తీరంలో గ్రావెల్ అక్రమాలు రూ.కోట్లకు చేరాయి. గూడూరు నియోజకవర్గంలోని చిట్టమూరు మండలం మొలకలపూడి, రామాపురం చెరువుల నుంచి పెద్దఎత్తున మట్టిని కొల్లగొట్టారు. జాతీయ రహదారి పనులకు స్థానిక అధికార పార్టీ నేతల ప్రమేయంతో పెద్దఎత్తున మట్టిని తరలించగా సుమారు రూ.3 కోట్ల రాయల్టీ జలవనరుల శాఖకు నేటికీ చేరలేదు.

అక్రమాలపై ఈనెల 24వ తేదీన 'వాటాలు వేసుకొని.. మూటలు కట్టుకొని' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన జలవనరులశాఖ గూడూరు ఈఈ బాబు తరలించిన మట్టికి క్యూబిక్ మీటరుకు రూ.150 చొప్పున నగదు ప్రభుత్వానికి చెల్లించాలని రహదారి నిర్మాణ సంస్థకు లేఖ రాశారు. మట్టి తరలింపునకు తాము నగదు చెల్లించామని సదరు సంస్థ సమాధానం ఇవ్వడంతో ఆయన ఖంగుతిన్నారు. చెల్లించి ఉంటే ఇంతకీ రూ.3 కోట్లు ఏమైనట్లు.. ఎవరి జేబుల్లోకి వెళ్లినట్లు అన్నది ఇప్పుడు తేలాల్సి ఉంది. రెండురోజుల కిందట వారు అన్ని శాఖల అధికారులతో కలిసి సంయుక్త విచారణ చేపట్టారు. చెరువు సంఘాల అధ్యక్షులు, ఆయకట్టు రైతులు మాత్రం తమ చెరువుల్లోని మట్టిని జాతీయ రహదారి పనులకు తరలించారని స్పష్టం చేశారు. తదనంతరం ప్రభుత్వ ఖజానాకు చలానా రూపంలో చెల్లించాలని జలవనరుల శాఖ అధికారులు గుత్తేదారు సంస్థకు లేఖ పంపడం సర్వత్రా చర్చనీయాంశమైంది.


మట్టి అక్రమంగా తరలించిన చిట్టమూరు మండలంలోని మొలకలపూడి చెరువు

ఆ అధికారే విచారించడమా..?

అక్రమ తరలింపుపై విచారణ సైతం విమర్శలకు కేంద్రంగా మారింది. ఆరోపణలున్న అధికారే విచారిస్తే నిజాలు ఎలా బయటకు వస్తాయని ఆయకట్టు రైతులతో పాటు సిబ్బంది విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు వాటాల పంపకంలో తమకు ఎలాంటి ప్రమేయం లేదని పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయమై జలవనరులశాఖ గూడూరు ఈఈ బాబును వివరణ కోరగా మట్టి అక్రమ తరలింపుపై క్షేత్రస్థాయిలో విచారించామని, జాతీయ రహదారి పనులకు మట్టి తరలించినట్లు రైతులు చెప్పారని, నగదు చెల్లించాలని రహదారి నిర్మాణ సంస్థకు లేఖ పంపినట్లు వెల్లడించారు.

అన్ని మండలాల్లోనూ అదే తీరు

మొలకలపూడి, రామాపురం చెరువుల నుంచి ఆర్నెల్లపాటు అధికార పార్టీ నేతల ప్రమేయం, జలవనరుల శాఖ అండదండలతో రెండు లక్షల క్యూబిక్ మీటర్లు మేర మట్టిని తరలించారు. ఇందుకు సుమారు రూ.3 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా యూనిట్‌కు రూ.200 చొప్పున నేతలే వసూలు చేసి వాటాలు పంచుకున్నట్లు సమాచారం. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు తదితర మండలాల్లోనూ ఇదేతీరున గ్రావెల్, మట్టి తవ్వకాలతో నేతలు రూ.కోట్లకు పడగలెత్తుతుండగా ఖజానాకు గండిపడుతోంది.



కల్లం లేక.. కళ్లెం వేయక

శ్రీకాళహస్తి నుంచి తొండమనాడుకు వెళ్లే మార్గంలో చెర్లోపల్లి వద్ద వరిధాన్యాన్ని ఇలా రహదారిలో కుప్పలుగా పోశారు. వర్షాలు లేకపోయినా.. మోటార్ల సాయంతో అరకొరగా వస్తున్న నీటితోనే పండించారు. దళారులు గిట్టుబాటు ధర రూ.2,461 చెల్లించకుండా లోపాయికారిగా వ్యవహరిస్తుండటంతో ఇలా ప్రమాదకరంగా ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **ఈనాడు, తిరుపతి; న్యూస్‌టుడ్, శ్రీకాళహస్తి**

రెండేళ్లు.. 19,847 వినతులు

- తిరుపతి అర్బన్, రూరల్ నుంచి అర్జీల వెల్లువ

ఈనాడు- తిరుపతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ ఏడాది ఆగస్టు 20 వరకు నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 94,342 అర్జీలు వచ్చాయి. అందులో 80,864 దరఖాస్తులు పరిష్కరించామని అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా ఏఏ మండలాల నుంచి విన్నపాలు వస్తున్నాయనే అంశంపై అధికారులు దృష్టి సారించారు.

మొదటి పది మండలాల్లో తిరుపతి అర్బన్ ఉండటం గమనార్హం. ఇక్కడి నుంచి ఏకంగా 11,132 అర్జీలు వచ్చాయి. తర్వాత స్థానంలో తిరుపతి గ్రామీణ మండలం ఉంది. 8,715 మంది ఫిర్యాదు చేయగా 8,121 పరిష్కరించినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ మండలంలో అధికశాతం మంది భూసమస్యలపైనే విన్నవిస్తున్నారు. నిషేధిత జాబితాలోని భూములు తొలగించాలని, ఆర్‌వోఆర్ అభ్యంతరాలు పరిష్కరించాలని కోరుతున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట, శ్రీకాళహస్తి రూరల్, ఏర్పేడులోనూ సమస్యలు అధికమే. చంద్రగిరి, డక్కిలి, కోడూరు, వెంకటగిరి మండలాలు మొదటి పది స్థానాల్లో ఉన్నాయి. చిన్నదైన రామచంద్రాపురం కూడా ఎక్కువ అర్జీలు వచ్చే మండలాల్లో ఒకటి.

పునఃపరిశీలన అధికమే

అధికారులు కాగితాలపై ప్రజల సమస్యలు పరిష్కరించామని చెబుతున్నారే తప్ప వాస్తవంగా ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీంతోనే ఇంత ఎక్కువ సంఖ్యలో అర్జీలు వస్తున్నాయి. వీటిని తిరిగి రీఓపెన్ చేయాల్సి వస్తోంది.

చూస్తే వణుకు.. దాటితేనే బతుకు



చిగురువాడ.. లేదే వంతెన జాడ

తిరుపతి గ్రామీణ మండలంలో ఐదేళ్ల కిందట వచ్చిన భారీ వరదలకు చిగురువాడ, ముండ్లపూడి, తనపల్లి వద్ద ఉన్న నాలుగు వంతెనలు కొట్టుకుపోయాయి. రూ.72 కోట్లతో ప్రతిపాదనలు పంపించినా ఫలితం లేకుండా పోయింది. **- న్యూస్‌టుడే, తిరుపతి (గ్రామీణం)**

- కాలం చెల్లిన వంతెనలు

అవన్నీ దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనలు.. ఎప్పుడు కూలుతాయో తెలియని దుస్థితి. ఉద్ధృతంగా పారే వాగుల, వంకల దెబ్బకు వీటిని దాటేలంటే వాహన చోదకులకు గుండెదడ తప్పడం లేదు. రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. కొత్తవి నిర్మించాలన్న ప్రతిపాదనలు దస్త్రాలకే పరిమితమైంది. దీంతో వంతెనలపై ప్రయాణం నిత్యం ప్రమాదకరంగా మారింది.

పట్టుతప్పితే కైవల్యమే..!

వెంకటగిరిలోని బ్రిటిష్‌కాలంనాటి వంతెన శిథిలావస్థకు చేరింది. కాలపరిమితి ముగిసిందని, భారీ వాహనాలు నడపొద్దని ర.భ.శాఖ హెచ్చరిక బోర్డులు పెట్టి ఏళ్లు గడుస్తున్నాయి. కాశీపేట వద్ద కైవల్య నదిపై ఉన్న ఈ వంతెనపై హెచ్చరికలు పట్టించుకొనే పరిస్థితి లేదు. **- న్యూస్‌టుడే, వెంకటగిరి గ్రామీణం**





సంచులేసి.. ఐదేళ్లు

చంద్రగిరి పరిధిలో జాతీయ రహదారి నుంచి నడింపల్లి (ఎం.కొత్తపల్లి)కి చేరుకునే మార్గంలో స్వర్ణముఖి నదిపై నిర్మించిన వంతెన 2021 నవంబరులో వచ్చిన వరదల్లో కొట్టుకుపోయింది. అప్పట్లో సంచుల్లో ఇసుక నింపి సిమెంట్ పైపులతో తాత్కాలిక వారధి నిర్మించారు. ఇసుక లారీలు, ట్రాక్టర్లు, జేసీబీలు, ప్రైవేటు పాఠశాలల బస్సులు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుండటంతో వంతెన దుస్థితికి చేరింది. ఇసుక బస్తాలు చిరిగిపోయి పట్టు సడులుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. **- న్యూస్‌టుడే, చంద్రగిరి**

7 మండలాలకు ఆధారమైనా..

దామలచెరువు పరిధిలోని పెద్దవంక వంతెనపై 1983లో నిర్మించిన వంతెన 75 మీటర్ల పొడవుంది. ఏడు మండలాల ప్రజలు, నిత్యం 2,500 వరకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇనుప కమ్మీలు తుప్పు పట్టి బయటకు తేలాయి. ఆక్రమణలు తోడుకావడంతో ప్రమాదం పొంచి ఉంది. **- నూస్‌టుడే, పాకాల**





బాలిరెడ్డిపాలెం.. దాటలేం

వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం వద్ద స్వర్ణముఖిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. 2023 డిసెంబరులో అప్పటి వైకాపా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.30 కోట్లతో వంతెన నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చినా నెరవేరలేదు. వరదలతో పది గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. **- న్యూస్‌టుడే, వాకాడు**



కాళంగిపై కలవరం

సూళ్లూరుపేట పట్టణంలో కాళంగి నదిపై వంతెన బలహీనంగా మారింది. ప్రాధాన్యం కలిగిన ఈ వంతెన కూలితే ఎన్‌హెచ్ 16 నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాలు పూర్తిగా స్తంభించే అవకాశం ఉంది. నాయుడుపేట మండలంలో మేనకూరు వద్ద మామిడి కాలువపై వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. అయ్యప్పరెడ్డిపాళెం వద్ద ఇదే దుస్థితి. **- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**

రూ.80 కోట్లతో ప్రతిపాదనలు

35-40 చిన్న వంతెనలు, కాజ్‌వేల పునరుద్ధరణకు జాబితా సిద్ధం చేశాం. తిరుచానూరు-పూడి, తనపల్లి, రాయలచెరువు రోడ్డులో రెండు, సుళ్లూరుపేట, నాయుడుపేట సమీపంలోని వంతెనల నిర్మాణానికి రూ.80 కోట్లు రాన్నాయి. నాయుడుపేట వద్ద రూ.9.5 కోట్లు, పాలమంగళం వద్ద రూ.4.5 కోట్లతో టెండర్లు ఆహ్వానించాం.
- రాజానాయక్, ర.భ.శాఖ ఎస్ఈ

అరచేతిలో.. గ్రంథాలయం

- అందుబాటులో డిజిటల్ సేవలు

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, సాధారణ ప్రజల కోసం నూతన సేవలను అమల్లోకి తీసుకొచ్చారు. గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి సమాచారం పాఠకులకు అందుబాటులోకి వచ్చేలా చూస్తున్నారు. ఏ గ్రంథాలయంలో ఎలాంటి పుస్తకాలు ఉన్నయో తెలుసుకోవచ్చు. గ్రంథాలయంలోకి ప్రవేశించే సమయంలో విజిటర్స్ లాగిన్‌పై క్లిక్ చేసి బార్‌కోడ్‌ను స్కాన్ చేయాలి. తిరిగి వెళ్లే సమయంలో స్కాన్ చేస్తే సక్సెస్ మెసేజ్ వస్తుంది.

65 వేల మందికి సభ్యత్వం..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 71 గ్రంథాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 65 వేల మందికి సభ్యత్వం ఉంది. కొత్తగా రూపొందించిన యాప్ ద్వారా పుస్తకాలకు సంబంధించి సమాచారం ఒకే చోట అందుబాటులోకి వచ్చింది.

ఉమ్మడి జిల్లా సమాచారం
శాఖా గ్రంథాలయాలు: 71
అందుబాటులో పుస్తకాలు: 8 లక్షలు పైగా
ఆన్‌లైన్‌లో ఉన్నది: 60 వేలకు పైగా

నేడు పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికను కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

నైపుణ్యాభివృద్ధే ఎస్వీయూ లక్ష్యం

ఇంటర్వ్యూ

- ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు
- నూతన పరిశోధనలు
- వీసీ నరసింగరావు

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు ఎస్వీయూ విశేష కృషి చేస్తోందని వీసీ ఆచార్య నరసింగరావు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు, ప్రముఖసంస్థల సహకారంతో నూతన కోర్సులు రూపొందించి శిక్షణ అందిస్తున్నామన్నారు. 72 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది ఉపాధి కల్పించేలా కృషి చేస్తున్నామని వివరించారు. 'న్యూస్‌టుడే' ముఖాముఖి వివరాలు ఆయన మాటల్లోనే..!



అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు

నేచర్ ఇండెక్స్ 2025-26 ర్యాంకింగ్స్‌లో దేశంలో 234, అకడమిక్ విభాగంలో 183, ఎర్త్‌అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగంలో 34 స్థానాలు రావడం వర్సిటీ పరిశోధనల్లో నాణ్యతకు నిదర్శనం. ఇతర ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటాం. పరిశోధనా గ్రాంట్లు, అంతర్జాతీయ ప్రచురణలు, పేటెంట్లు, పరిశ్రమలతో భాగస్వామ్యాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ విభాగాల్లో పరిశోధనా ప్రాజెక్టులకు రూ.5 కోట్లు వెచ్చించనున్నాం.

క్వాంటంపై నూతన కోర్సులు

గతేడాది ఎంఎస్ డేటాసైన్స్ కోర్సు ప్రారంభించాం. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎంఎస్ క్వాంటం టెక్నాలజీ కోర్సు రూపకల్పన చేస్తున్నాం. అదనంగా మినరల్ ప్రాసెసింగ్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్ల టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, హైడ్రోజన్ మొబిలిటీ, జియోస్పాటల్ టెక్నాలజీలో యూజీ, పీజీ కోర్సులు ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం

విద్యావిధానాన్ని పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేసి అంతర్జాతీయ పరిశోధనలకు అవకాశాలు కల్పిస్తున్నాం. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ సంస్థతో కలిసి మెటీరియల్ సైన్స్‌లో పరిశోధనలు జరుగుతున్నాయి. ఐసర్‌తో కలిసి పరిశోధనలు, యువత ఉపాధికి బాటలు వేస్తున్నాం. దీంతో 500 మంది వరకు లబ్ధి చేకూరుతుంది. డీఆర్‌డీవో, ఐఎస్ఆర్‌వో, ఎన్ఏఆర్ఎల్, వీఎస్ఎస్‌టీ, ఐఐటీలు, హెచ్‌సీయూ, ఎస్ఆర్ఎం సాంకేతిక సహకారం అందుకుంటున్నాం. ఐబీఎం, డబ్ల్యూఐఎస్ఈఆర్, క్యూయూబీఐసీవో వంటి సంస్థలతో కలిసి ఇండస్ట్రీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, నైపుణ్యాభివృద్ధి కోర్సులు రూపొందించాం.

పరీక్షల నిర్వహణలో పారదర్శకత

వర్సిటీ పరిధిలో 125 ఆచార్య పోస్టుల భర్తీకిగాను స్క్రీనింగ్ ప్రక్రియ పూర్తయింది. పరిశోధనా అనుభవం కలిగినవారిని పరిగణనలోకి తీసుకుంటాం. వర్సిటీ అవసరాలకుగాను డిజిటల్ ఎగ్జామినేషన్ ప్రాసెస్ సెంటర్ ఏర్పాటుచేసి పారదర్శకతపై దృష్టి సారించాం. టీసీఎస్ సహకారంతో డిజిటల్ మూల్యాంకన విధానాన్ని అమలు చేస్తున్నాం. ఫలితాల ఆలస్యంపై సమీక్షించుకున్నాం. ఇకపై నిర్దేశిత గడువులోగా వెల్లడిస్తాం.

వరుణ యాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ



వరుణయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేస్తున్న ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కె.ఎస్.ఎస్. అవధాని, రుత్వికులు

తిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో తితిదే చేపట్టిన కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్య శాంతి హోమాలకు ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఇందులో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రాయశ్చిత్త హోమం, అంకురార్పణ చేపట్టారు. సెప్టెంబరు 3వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఈ యాగ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కె.ఎస్.ఎస్. అవధాని ఆధ్వర్యంలో ఈ యాగాలు జరుగుతున్నాయి.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు





▸ ఆలయం ఎదుట బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా ▸ తితిదే మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం దంపతులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి మూలమూర్తిని బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా, తితిదే మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం దంపతులు దర్శించుకున్నారు. ప్రముఖులకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.



శ్రీవారి ఆలయం ఎదుట ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబం

తిరుమల: శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.





● ఆలయంలో ముగ్గులు వేస్తున్న కార్మికులు ● గోపురానికి రంగులు వేస్తూ..

రంగవల్లులు.. ఉత్సవ కాంతులు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సెప్టెంబరు 14 నుంచి అక్టోబరు 4 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సంబంధిత ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రధాన, అనుబంధ ఆలయాలకు రంగులు వేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులను ఆకట్టుకునేలా రంగవల్లులు వేస్తున్నారు. ప్రధాన కూడళ్లు తదితర ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలంకరణ, ఆర్చిలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రద్దీ క్రమబద్ధీకరణకు అవసరమైన క్యూలైన్ల నిర్మాణం చేపడుతున్నారు. పనులను పాలకమండలి ఛైర్మన్ వి.మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ పర్యవేక్షిస్తున్నారు. **- న్యూస్‌టుడే, కాణిపాకం**

కైలాసం.. కమనీయ దృశ్యం





▸ సప్తగోకులం వద్ద ఆకట్టుకుంటున్న శ్రీమహావిష్ణు ప్రతిమ ▸ సహజంగా ఏర్పాటు చేసిన సుందరీకరణ పనులు

శ్రీకాళహస్తీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సుందరీకరణ పనులు చేపట్టారు. కొండ చరియల్లో దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏనుగులు, నెమళ్లు, హంసల చిత్రాలు, సహజత్వంతో ఉట్టిపడేలా కృత్రిమ జలపాతాలు భక్తులను అమాంతం ఆకట్టుకుంటున్నాయి. సప్తగోకులం పరిసర ప్రాంతాలను సుమారు రూ.25 లక్షలతో పచ్చదనంతో సర్వాంగ సుందరంగా భక్తులు మెచ్చేలా తీర్చిదిద్దారు. భక్తులు చరవాణుల్లో పదిలం చేసుకుంటూ ఆనందాన్ని పొందుతున్నారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

భవన నిర్మాణాలపై ఇంపాక్ట్

✤ పనులకు భారీగా రుసుములు ✤ గత ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు

★ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నగర, పురపాలక సంఘాల పరిధిలో 2,67,278 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా రూ.191.04 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలవుతుంది. ★ పుత్తూరు పట్టణంలోని స్వర్ణ హౌసింగ్ కాలనీలో జీప్లస్ వన్ ఇంటి నిర్మాణానికి రుసుములన్నీ లెక్కిస్తే సుమారు రూ.52,630 చెల్లించాల్సి వచ్చింది. వాణిజ్య సముదాయం అయితే చెల్లించాల్సిన రుసుం రెండింతలుగా మారింది.

పుత్తూరు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఇంపాక్ట్ రుసుము పేరుతో పన్ను విధించడంతో నిర్మాణదారులకు భారంగా మారింది. నగరాలు, పట్టణాల్లో భవన నిర్మాణాలకు ప్లాన్ అనుమతి పొందే సమయంలో నిర్మాణ ప్రాంతంలో చదరపు అడుగు ప్రకారం రుసుము వసూలు చేస్తున్నారు. దీంతో నగర పాలికలు, పురపాలికల పరిధిలో నిర్మాణాల అనుమతులకే రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

వివిధ రకాల పేర్లతో...

ఇంపాక్ట్ పన్ను, వీఎల్‌టీకి సంబంధించి మార్కెట్ విలువలో 0.05 శాతం కింద లెక్కిస్తే రూ.500 వచ్చిందనుకున్నాం. దీనికి ఏడుసార్లు లెక్కిస్తే రూ.3,500 చెల్లించాల్సి ఉంది. లేబర్ సెస్సు మొత్తం జాగా విలువలో ఒక శాతం, ట్రీగార్డు రూ.1,500, ఇంకుడు గుంత రూ.3-5వేలు, అభివృద్ధి ఛార్జి, భవన లైసెన్సు రుసుం, కాంపౌండ్ వాల్, యూజర్ ఛార్జీలు ఇలా పలు రకాల రుసుములు విధించి వసూలు చేస్తున్నారు.

ఇలా ఛార్జీలు..

కన్వర్షన్ ఛార్జీలు చ.మీ.కు రూ.15-20, లేఔట్ ఆమోదానికి హెక్టారుకు రూ.20 వేలు, సైట్ ఆమోదం చ.మీ.కు రూ.15, ఓపెన్ సైట్ ఛార్జీలు మొత్తం విలువలో 14 శాతం, బిల్డింగ్ పర్మిట్ రుసుము రూ.15-80, ఇంధన స్టేషన్లు, వేబ్రిడ్జిలకు చ.మీ.కు రూ.100, ఎగ్జిబిషన్, సర్కస్ తదితరాలకు చ.మీ.కు రూ.15 వరకు విధిస్తున్నారు.

అనుమతి సమయంలో బాదుడు..

స్థలంపై రిజిస్ట్రేషన్‌శాఖ నిర్ణయించిన మార్కెట్ విలువపై కార్పొరేషన్‌లో 2 శాతం, పురపాలక పరిధిలో 1 శాతం, పంచాయతీల్లో 0.5 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. ఇంపాక్ట్ రుసుము ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాల్లోనే అమలు చేస్తున్నారు. మాస్టర్ ప్రణాళికలో భాగంగా 60 అడుగుల నుంచి 150 అడుగుల వరకు ప్రతిపాదిత రోడ్డు, రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులు, బైపాస్ రోడ్డు, రింగ్ రోడ్డు పక్కన నిర్మించే నిర్మాణాలకు వర్తింపజేశారు. ఒక్కో నిర్మాణంపై ప్లాన్ సమయంలోనే రూ.లక్ష నుంచి రూ3.లక్షల వరకు అదనంగా భారం పడుతోంది.

ఆ ఒక్క పని చేయించండి సారూ

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వినతి



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం, సత్యవేడు మండలాలను అనుసంధానించే దాసుకుప్పం మినీ బైపాస్ నిర్మాణ పనులు చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తిలో సీఎంను కలిసిన ఎమ్మెల్యే.. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసినా పనులు చేయకుండా ఆగిపోయిన మినీ బైపాస్ ఆవశ్యకతను వివరించినట్లు చెప్పారు. ఆరేళ్లుగా ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులకు వినతులు ఇచ్చినా.. శాసనసభలో ప్రజావాణి వినిపిస్తున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ముఖ్యమంత్రి. రహదారి నిర్మాణ పనులకు ప్రతిపాదనలు, పరిశీలించాని అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా ఉండాలి


తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని చైతన్యపురంలో జరుగుతున్న సర్‌ను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేరు మార్పులు, చిరునామా సవరణలు, మరణించిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఓటర్లతో మాట్లాడారు.



ఓటర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

గిరులెల్లా.. నీ నామమే..!

శేషాచలంలోని ప్రతి అణువూ శ్రీవారి ప్రతిరూపాన్ని ప్రతిబింబిస్తోంది. తిరుమల-ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠానికి వెళ్లే మార్గంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ సమీపంలోని కొండ ప్రాంతం తిరునామాలతో ఆకట్టుకుంటోంది. ఇక్కడి మూడు రాళ్లలోని గోవిందనామాల్ని గుర్తించి రంగులు వేసి పూజిస్తున్నారు. ఈ మార్గంలో వెళ్లేవారిని ఈ కొండ ఆకట్టుకుంటోంది. **- న్యూస్‌టుడే, తిరుమల**



8న తితిదే పాలకమండలి సమావేశం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదే పాలకమండలి సమావేశం సెప్టెంబర్ 8వ తేదీన తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి తితిదే ఉన్నతాధికార యంత్రాంగం అజెండా తయారీలో ఇప్పటికే నిమగ్నమయ్యారు. ముఖ్యంగా సెప్టెంబరు, అక్టోబర్ మాసాల్లో జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలపై చర్చించనున్నారు. తాత్కాలిక, టైంస్కేల్, సొసైటీ, కార్పొరేషన్, అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు, సిబ్బంది, ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను అజెండాలో పొందుపరిచే అవకాశం ఉంది.

తలకోన ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రమైన తలకోనలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులను దేవాదాయ ధర్మదాయ శాఖ ఎస్ఈలు సతీష్, స్థపతి పరమేశ్వరప్ప ఆదివారం ఈవో రవీంద్రరాజు, ఛైర్మన్ సోమనాథరెడ్డితో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా రాజీపడకుండా ఉన్నత ప్రమాణాలతో పనులు చేయాలన్నారు. ప్రస్తుతం జరిగిన నిర్మాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రఘునాథ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ అన్నా సముద్రం మధు తదితరులు పాల్గొన్నారు.

పదివేల టోకెన్లు జారీ

తిరుపతి (తితిదే): తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి తిరుపతిలో శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు శనివారం అర్ధరాత్రి 12:30 గంటలకు 10 వేల సమయ నిర్దేశ ఎస్ఎస్‌డీ టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. అలాగే శ్రీవారి మెట్టు మార్గంలో వెళ్లే భక్తులకు 2 వేల టోకెన్లు జారీ చేశారు. ప్రస్తుతం సెలవులు లేనప్పటికీ తిరుమలకు వెళ్లే వారి సంఖ్య రోజు రోజుకీ విపరీతంగా పెరుగుతోంది.

నేడు ధర్మపథంలో గణపతి వ్రతం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: ధర్మపథంలోని శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి ఆలయంలో నేటి (సోమవారం) సాయంత్రం ఐదు గంటలకు సంకష్టహర గణపతి వ్రతాన్ని నిర్వహించనున్నామని ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆదివారం తెలిపారు. సాయంత్రం సంకష్టహర గణపతి వ్రతం, అనంతరం గణపతి హోమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన): ఎస్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలో తొమ్మిది జిల్లాలకు సంబంధించిన విద్యుత్తు వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు సోమవారం నిర్వహిస్తున్న డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. వినియోగదారులు తమ సమస్యలను ఫోన్ నంబరు 89777 16661కు కాల్ చేసి చెప్పాలని సూచించారు. ● జిల్లాల వారీగా సమస్యలపై ఉదయం 8:30 నుంచి 9:30 వరకు ఆయా జిల్లాల ఎస్ఈల ఆధ్వర్యంలో నిర్వహించే డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం ద్వారా తెలపవచ్చని సూచించారు.

డయల్ చేయాల్సిన నంబర్లు..

తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979

కాళికాదేవి విగ్రహానికి భద్రత

చంద్రగిరి, న్యూస్‌టుడే: వీరబ్రహ్మేంద్రస్వామి పుష్కరిణిలో లభ్యమైన కాళికాదేవి విగ్రహానికి పటిష్ఠ భద్రత కల్పించారు. శనివారం పూడికతీత పనుల్లో విగ్రహం లభ్యమైంది. సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న పుష్కరిణి మధ్యలో చేదబావి ఉంది. రాయల కాలంలో నిర్మించిన పుష్కరిణిలో ఇంకా మరేమైనా విగ్రహాలు ఉంటాయని గ్రామపెద్దలు అనుమానాలు వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు పోలీసుల, కూటమి నాయకుల పర్యవేక్షణలో కార్మికులు మట్టి తవ్వకాల పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గౌస్‌బాషా ఆదివారం మధ్యాహ్నం కార్మికులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సీఐ సురేష్‌కుమార్ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు.

సంచార జాతులకు గుర్తింపు, గౌరవం అందించడమే లక్ష్యం



ర్యాలీలో పాల్గొన్న భాజపా నాయకులు

తిరుపతి(గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: సంచార జాతులకు న్యాయమైన హక్కులు కల్పించి, సమాజంలో వారికి తగిన గుర్తింపు, గౌరవం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. స్థానిక లీలామహల్ కూడలిలో ఆదివారం భాజపా ఆధ్వర్యంలో సంచార-అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా 'స్ఫూర్తి' బహిరంగ సభ జరిగింది. అంతకు ముందు మున్సిపల్ పార్కు నుంచి సభవేదిక వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ... సంచార జాతులు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ధర్మాన్ని యుగాలుగా కాపాడుతూ వచ్చిన నిజమైన వారధులని కొనియాడారు. కార్యక్రమానికి మహారాష్ట్రకు చెందిన జాతీయ డీఎన్‌టీ కమిషన్ సభ్యుడు ప్రవీణ్ ప్రత్యేకంగా హాజరయ్యారు. భాజపా జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు ముని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బలిజ శంఖారావంలో ఏడు తీర్మానాలు



ప్రణీత్‌ను సత్కరిస్తున్న బలిజ సంఘాల నాయకులు

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: 2029 ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ ముఖ్యమంత్రిగా గెలుపొందాలని, కూటమి ప్రభుత్వం బేషరతుగా ఆయన పేరును ప్రకటించాలనే అంశంపై బలిజ సంఘం నాయకులు సుదీర్ఘ చర్చలు జరిపారు. తిరుపతి సమీపంలోని రాయలచెరువు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన బలిజ శంఖారావం సభలో సామాజికవర్గ పెద్దలు మాట్లాడారు. శంఖారావం సభలో ఏడు తీర్మానాలను ఆమోదించినట్లు అఖిల భారత కాపు చరిత్ర సంకలన సమితి కన్వీనర్ దూపం అభిమన్యు పేర్కొన్నారు. తిరుపతిలో ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిన బలిజ భవన్‌ను నిర్మాణానికి సొంతంగా భూమికొని నిర్మించాలని శంఖారావం తీర్మానించింది. ఇందుకు మద్దతుగా బలిజ భవన్ నిర్మాణానికి ప్రణీత్ ఫౌండేషన్ తరఫున రూ.50 లక్షలు, సూరా మోహన్ ప్రసాద్ రూ.20 లక్షలు, వసంతం శ్రీనివాస్ రూ.25 లక్షలు, ఆమంచి స్వాములు రూ.5లక్షలు మరో 12 మంది కలిసి రూ.17లక్షలు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, తితిదే విశ్రాంత డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, క్రెడాయ్ మాజీ అధ్యక్షుడు వసంతం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బొప్పరాజుపై విమర్శలు సరికాదు

రాయచోటి, న్యూస్‌టుడే: ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం సాగిస్తున్న ఏపీ ఐకాస అమరావతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుపై.. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.నరసింహకుమార్, కె.గోపీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఉద్యోగ సంఘ నాయకులపై విమర్శలు చేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావన్నారు.

సహజ జీవనమే ఆరోగ్యానికి శాశ్వత పునాది



మాట్లాడుతున్న మంతెన సత్యనారాయణరాజు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ప్రకృతికి అనుగుణంగా జీవించడం, సహజ ఆహారం తీసుకోవడం, తగినంత విశ్రాంతి, స్వచ్ఛమైన నీరు, గాలిని అలవాటుగా చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డా.మంతెన సత్యనారాయణ రాజు తెలిపారు. ఆయుష్, తితిదే ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన ఆరోగ్య పరిరక్షణ అవగాహన కార్యక్రమం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహజ ఆహారం, స్వచ్ఛమైన నీరు, గాలి, తగినంత విశ్రాంతి ఆరోగ్య సంజీవనిలోని నాలుగు ముఖ్య అంశాలని పేర్కొన్నారు. ఆరోగ్యంపై ముందుగానే శ్రద్ధ వహించి మంచి జీవన అలవాట్లు పాటిస్తే అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో ఆనందరాజు, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, తితిదే ఉద్యోగులు పాల్గొన్నారు.

త్వరలో సేవా సంకల్ప ఉత్సవం




ఆలయం ఎదుట భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్, శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, రమేష్‌నాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, ప్రధానిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న మోదీ.. దేశం కోసం చేసిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప ఉత్సవం' నిర్వహిస్తున్నట్లు ఏపీ భాజపా అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. ఆదివారం భాజపా నాయకులతో కలిసి శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. త్వరలోనే దేశవ్యాప్తంగా సేవా సంకల్ప ఉత్సవం నిర్వహించి దేశం కోసం మోదీ చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో భాజపా నాయకులు సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..

సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సనత్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలను పోలీసులు తెలిపారు. ఏపీలోని తిరుపతి జిల్లాకు చెందిన బత్తుల నాగరాజు 2013లో విజయ సలోమిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ నాగరాజు మోతీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల నాగరాజు గుర్తుతెలియని రసాయనం తాగి అపస్మారక స్థితికి చేరాడు. దీంతో భార్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లింది. అనంతరం అతని బాబాయ్ సతీశ్ బాబు మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి నాగరాజు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

అప్పు తీర్చలేక ఆత్మహత్య



ఓజిలి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన ఓజిలి గ్రామానికి చెందిన మైలాం జయచంద్రా రెడ్డి(60) పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఓజిలి గ్రామానికి చెందిన మైలాం జయచంద్రా రెడ్డి అదే గ్రామానికి చెందిన స్నేహితుడితో కలిసి వడ్డీ వ్యాపారం చేసేవాడు. జయచంద్రా రెడ్డి స్నేహితుడి వద్ద రూ.ఇరవై లక్షలు అప్పుతీసుకుని బ్యాంక్‌లో రైతుల బంగారు నగలను రెన్యువల్ చేస్తూ ఉండేవాడు. స్నేహితుడికి నగదు తిరిగి ఇవ్వలేక పోవడంతో ఇద్దరి మధ్య మనస్పర్ధలు తలెత్తాయి. దీంతో మనస్తాపం చెందిన జయచంద్రా రెడ్డి ఈనెల 20వ తేదీన పంట పొలంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెన్నైలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'హైస్కూల్ ప్లస్'.. అంతా మైనస్!

అగమ్యగోచరంగా విద్యార్థుల భవితవ్యం

ఈనాడు డిజిటల్, తిరుపతి: ఎంతో ఉన్నతాశయంతో ప్రారంభమైన 'హైస్కూల్ ప్లస్' విధానం పూర్తిగా గాడితప్పింది. సరైన ప్రణాళిక, పర్యవేక్షణ లేకపోవడంతో వాటి నిర్వహణ గాలికి దీపంలా తయారైంది. పూర్తిస్థాయిలో ప్రిన్సిపాళ్లను నియమించకపోవడం, కేవలం డిప్యూటేషన్ అధ్యాపకులతోనే నెట్టుకొస్తుండటంతో వ్యవస్థ కుంటుపడింది. ముఖ్యంగా పాఠశాల విద్యాశాఖకు, ఇంటర్మీడియట్ బోర్డుకు మధ్య కనీస సమన్వయం లేకపోవడం, అదనపు బాధ్యతలు తీసుకుంటున్న ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రోత్సాహకాలు అందకపోవడంతో ఈ సంస్థలు చతికిలబడుతున్నాయి.

త్రిశంకు స్వర్గంలో పర్యవేక్షణ

ఈ విధానం విద్యాశాఖలో వింత పరిస్థితిని సృష్టించింది. ఒకరకంగా ఈ సంస్థలు ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక్కడ ఇంటర్మీడియట్ సిలబస్ అమలవుతున్నప్పటికీ.. ఇవి ఇంటర్ బోర్డు పరిధిలోని ఆర్ఐవోల పర్యవేక్షణలోకి రావు. ఇవి కేవలం పాఠశాల విద్యాశాఖ పరిధిలోనే ఉంటాయి. పరీక్షలు నిర్వహించుకోవడానికి, అడ్మిషన్ల అనుమతుల కోసం మాత్రమే ఇంటర్ బోర్డును ఆశ్రయిస్తున్నారు. దీంతో విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయో ప్రత్యక్షంగా పర్యవేక్షించేవారు కరవయ్యారు.

బోధనేతర సిబ్బంది లేరు

ప్రతి సెక్షన్‌కు 80 మంది విద్యార్థుల సామర్థ్యం ఉన్నప్పటికీ.. కనీస మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన కొరవడటంతో ఈ 'ప్లస్' స్కూళ్లలో చేరికలు నామమాత్రంగానే ఉంటున్నాయి. దీనికితోడు క్లర్కులు, అటెండర్లు, స్వీపర్లు వంటి నాన్-టీచింగ్ (బోధనేతర) సిబ్బంది నియామకం ఊసేలేదు. దీంతో రికార్డుల నిర్వహణ నుంచి చిన్నచిన్న పనుల వరకు అధ్యాపకులే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పర్యవేక్షణ లోపం, బోధనాపరమైన ఇబ్బందుల కారణంగా ఇక్కడ పరీక్షా ఫలితాలు దారుణంగా పడిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ 'హైస్కూల్ ప్లస్'ల దుస్థితిపై దృష్టి సారించాలని, తక్షణమే ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బందిని నియమించి వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

హెచ్‌ఎంల సతమతం.. దక్కని ప్రోత్సాహం

జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున.. 37 స్కూళ్లను 'హైస్కూల్ ప్లస్'లుగా అప్‌గ్రేడ్ చేశారు. నిబంధనల ప్రకారం ఇంటర్మీడియట్ విద్యను బోధించే ఈ సంస్థలకు ప్రత్యేకంగా ఒక ప్రిన్సిపల్ ఉండాలి. కానీ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకే ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. సాధారణంగా జూనియర్ కాలేజీలు, పోలీసు శిక్షణ కేంద్రాలకు డిప్యూటేషన్‌పై వెళ్లే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఒక ఇంక్రిమెంట్ అదనంగా ఇస్తూ ప్రోత్సహిస్తోంది. కానీ వీటిలో బోధిస్తున్న పీజీటీలకుగానీ, బాధ్యతలు పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎంలకుగానీ ఎలాంటి అదనపు ఆర్థిక ప్రయోజనం, గుర్తింపు దక్కడం లేదు. దీంతో ఇప్పటికే పాఠశాల విధులతో సతమతమవుతున్న హెచ్‌ఎంలు ఈ అదనపు భారాన్ని మోసేందుకు, 'ప్లస్-2' వ్యవహారాలపై దృష్టి సారించేందుకు ఆసక్తి చూపడం లేదు.

'ప్లస్' వద్దంటున్న స్కూళ్లు

ప్రభుత్వం సరైన సిబ్బందిని నియమించకుండానే, హెచ్‌ఎంలకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండానే అప్‌గ్రేడ్ చేస్తుండటంతో కొన్ని పాఠశాలలు 'ప్లస్' హోదాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇందుకు సత్యనారాయణపురం పాఠశాల పరిస్థితే ప్రత్యక్ష ఉదాహరణ. ప్రభుత్వం ఈ పాఠశాలకు 'హైస్కూల్ ప్లస్' అవకాశం ఇచ్చినా, అక్కడ బోధించడానికి పీజీటీలు లేకపోవడం, బాధ్యతలు తీసుకునేందుకు వారు సుముఖంగా లేకపోవడంతో అడ్మిషన్లు చేసుకోలేదు. సంవత్సరం గడిచినా ప్రభుత్వం కొత్తగా పీజీటీలను నియమించలేదు. దీంతో ఇతర పాఠశాలల నుంచి కేవలం కొందరు ఉపాధ్యాయులను (తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) తీసుకొచ్చి డిప్యూటేషన్ మీద క్లాసులు చెప్పిస్తూ నెట్టుకొస్తున్నారు.

తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

నేడు సర్వసభ సమావేశం

తిరుపతి (గ్రామీణం): గ్రామీణ మండల సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దేవిక పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే సాధారణ సర్వసభ్య సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

రోడ్డుపై గుంత పూడ్చారు

తిరుపతి (గ్రామీణం): వేదాంతపురం గ్రామం ముఖద్వారం వద్ద రాయలచెరువు రోడ్డుపై ఏర్పడ్డ గుంతను పంచాయతీ అధికారులు పూడ్చారు. పైపు లైను కోసం తీసిన గుంతను పూడ్చకపోవడంతో సమస్యపై 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పనులు చేపట్టారు.

సర్ పరిశీలన

చిన్న గొట్టిగల్లు, న్యూస్‌టుడే: చిన్నగొట్టిగల్లు మండలంలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని ఆర్డీవో రామ్మోహన్ ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా పోలింగ్ కేంద్రం నంబరు 47ను పరిశీలించి తగు సూచనలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(నగరపాలిక) న్యూస్‌టుడే: ● కొర్లగుంట మారుతీనగర్‌లో తెలుగుగంగ నీటి సరఫరా సక్రమంగా లేదు. సమయపాలన, ఒక్కోరోజు ఒక్కో సమయంలో కొద్దిసేపు నీటిని వదిలి ఆపేస్తున్నారు. **- జయలక్ష్మి, కొర్లగుంట**

■ సంబంధిత ప్రాంత సిబ్బందిని ఆదేశించి సమస్యను పరిష్కరిస్తాం. **- శ్యాంసుందర్, ఎస్.ఈ.నగరపాలిక**

● నాలుగు కాళ్ల మండపం నుంచి శ్రీదేవి కాంప్లెక్స్‌కు వెళ్లే మెయిన్ రోడ్డుపైన పెద్ద గుంత ఉంది. పైప్‌లైన్ మరమ్మతుల కోసం గుంత తవ్వి వదిలేడంతో రాకపోకలు ఇబ్బందిగా మారాయి. **- వినాయక, ఆటో డ్రైవర్**

■ పనులు చేసిన గుత్తేదారును ఆదేశించి గుంత పూడ్చేందుకు చర్యలు చేపడతాం.
- శ్యాంసుందర్, ఎస్.ఈ, నగరపాలిక

జాతీయ రహదారిపై కోళ్ల వ్యర్థాలు



తిరుపతి-అనంతపురం రహదారి నరసింగాపురం రైల్వే గేటు వద్దకు రాగానే వాహనదారులు దుర్వాసనతో ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. రహదారి పక్కనే ఉన్న కోళ్లఫారం నిర్వహణపై ప్రయాణికులు, వాహన చోదకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలు జాతీయ రహదారిపైకి వస్తుండటంతో ఆ ప్రాంతం అధ్వానంగా మారింది. చర్యలు తీసుకుంటామని మిట్టపాలెం పంచాయతీ కార్యదర్శి హారతి తెలిపారు.
- న్యూస్‌టుడే, చంద్రగిరి గ్రామీణ

కుంగిన కల్వర్టు



నగరంలోని ముత్యాలరెడ్డిపల్లిలోని జడ్పీ అతిథి గృహం వద్ద కల్వర్టుపై ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్ ప్రమాదకరంగా మారింది. కల్వర్టు వద్ద చెత్తా చెదారం, వ్యర్థాలను తొలగించేందుకు ఇనుప గ్రిల్ ఏర్పాటు చేశారు. వాహన రాకపోకల తాకిడికి గ్రిల్ కుంగిపోయింది. రాత్రివేళ వాహన చోదకులు, పాదచారులు కుంగిన గ్రిల్‌ను గుర్తించలేక ప్రమాదాలకు గురౌతున్నారు.
- న్యూస్‌టుడే, తిరుపతి(గ్రామీణం)

వేగ నిరోధకాలతో అవస్థలు

తిరుపతి-కరకంబాడి మార్గంలో సుబ్బారెడ్డినగర్, ఎస్వీ పూర్ హోమ్ సమీపంలో ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. అడుగు భాగంలో సిమెంట్ కాంక్రీటు ఊడిపోవడంతో ఇబ్బందిగా మారింది.
- న్యూస్‌టుడే, తిరుపతి(మంగళం)



ఇలా వెళ్తే ప్రమాదమే..!



రోడ్డు నిబంధనలు పాటించక.. నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా కొందరిలో మార్పు రావడం లేదు. ఆదివారం స్థానిక రాయలచెరువు బైపాస్ రోడ్డులో నలుగురు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఇలా కనిపించారు. ఏదైనా జరగరాని ఘటన జరిగితే అంతేనని ప్రజలు పేర్కొంటున్నారు.
- న్యూస్‌టుడే, తిరుపతి(విద్య)

కాలువ పోరంబోకును రక్షించండి

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: సి.మల్లవరం పంచాయతీలో ఆక్రమణలకు గురవుతున్న కాలువ పోరంబోకును రక్షించాలని తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు మనోహర్‌చౌదరి డిమాండు చేశారు. ఆదివారం కాలువ పోరంబోకు వద్ద తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు మనోహర్‌చౌదరి ఆధ్వర్యంలో కూటమి నాయకులు నిరసన తెలిపారు. పంచాయతీలోని సర్వే నం.49లో కాలువ పోరంబోకు స్థలం ఉందన్నారు. వైకాపా మాజీ సర్పంచ్‌లు ఇద్దరు స్థలాన్ని పంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. గ్రామ ప్రయోజనాలను పక్కనపెట్టి సొంత ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములను ఆక్రమించడం దారుణమన్నారు. ఆక్రమణపై తక్షణమే విచారణ జరిపి, రికార్డులను పరిశీలించి అడ్డుకట్ట వేయాలని కోరారు. కలెక్టర్, తహసీల్దార్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు నవీన్, జనసేన మురళి పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం విజయవంతం



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: శ్రీసాయి సుధా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నలంద నగర్‌లోని సాయి సుధ ఫిజియోథెరపీ కేంద్రంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైనట్లు డాక్టర్ సుధారాణి తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు శిబిరం నిర్వహించారు. సుమారు వంద మందికి కంటి పరీక్షలు, ఎముకల పరీక్షలు నిర్వహించి సలహాలు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పది మందిని నేత్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు డాక్టర్ సుధారాణి తెలిపారు. శ్రీరంజని, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ సమస్యలు..?

☛ పూర్తికి నోచుకోని తరగతి గదులు ☛ ఇబ్బందుల్లో విద్యార్థులు



మూలకు చేరిన బెంచీలు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: బైరాగిపట్టెడలోని ఎంజీఎం పాఠశాలలో సరిపడా తరగతి గదులు, వసతులు, సౌకర్యాలు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. రెండేళ్ల కిందట పాత భవనంలో వర్షపునీరు లీకేజీ అవడంతో స్లాబ్ పెచ్చులూడి విద్యార్థులపై పడింది. దీంతో అప్పటి నుంచి ఈ భవనంలో తరగతులు నిర్వహించకుండా నిరుపయోగంగా వదిలేశారు. దీని పైఅంతస్తులో తరగతులు నిర్వహించడానికి ఉపాధ్యాయులు సాహసించలేదు. ఇదే గదిలో విద్యుత్తు తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. పాఠశాలలో మొత్తం 11 తరగతి గదులు అసంపూర్తి నిర్మాణాలతో వదిలేశారు. రూ.లక్షల విలువ చేసే బల్లలు, కుర్చీలు ఒక గదిలో నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం మరో భవనంలో చాలీచాలని గదుల్లో పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు.



అసంపూర్తి భవనం కింద సైకిళ్ల పార్కింగ్

సైకిళ్ల పార్కింగ్‌కు వినియోగం

వైకాపా హయాంలో నాడు-నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. శ్లాబ్ వరకు నిర్మాణం చేపట్టి పనులు అసంపూర్తిగా వదిలేశారు. నేటికి మూడేళ్లు కావస్తున్నా.. నిర్మాణం మొండి గోడలతో దర్శనమిస్తోంది. ఆ భవనం కింది భాగంలో విద్యార్థులు సైకిళ్లు ఉంచుతున్నారు. ఇన్ని సమస్యల మధ్య విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మూలకు చేరిన ఆర్వో ప్లాంటు

తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు సైతం మరమ్మతుకు నోచుకోక మూలకు చేరింది. కుళాయి నీటినే తాగుతూ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు పరంధామనాయుడుని వివరణ కోరగా.. కార్పొరేషన్ వారికి సమాచారం ఇచ్చామని భవనాన్ని మరమ్మతులు చేయడమో.. లేదా నూతన భవనాన్ని నిర్మించేందుకు అంచనాల వేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు తాగునీటి యంత్రాలను సిద్ధం చేస్తామని.. ప్రస్తుతం స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నట్లు చెప్పారు.

ముఖ్యమంత్రిని కలిసిన తెదేపా ఇన్‌ఛార్జి



జేబీ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆదివారం తిరుపతి తెదేపా ఇన్‌ఛార్జి జేబీ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో బాధ్యతలు తీసుకున్న తర్వాత చేపట్టిన పార్టీ కార్యక్రమాలు, తిరుపతిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయన అధినేతకు వివరించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహయాదవ్, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్‌వర్మ ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి ఆలయం ఎదుట జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయం వద్ద ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయలు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

తిరుచ్చిపై ఊరేగిన సుందరరాజస్వామి



తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు పద్మావతీ అమ్మవారి ఆలయంలో కొలువుదీరిన సుందరరాజస్వామి ఆదివారం రాత్రి తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్ర పురస్కరించుకుని ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అలంకార శోభితుడైన స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా వాహనంపై ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.

భయం భయంగా విధుల నిర్వహణ



కార్యాలయ శ్లాబ్ విరిగిపోయి బయటపడిన కమ్మీలు

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే : తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. 20 ఏళ్ల కిందట కార్యాలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం పెచ్చులూడుతూ, శ్లాబ్ కమ్మీలు తేలిపోయాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి రోజూ వందల సంఖ్యలో రైతులు, మహిళలు, విద్యార్థులు తమ పనుల నిమిత్తం వస్తుంటారు. కార్యాలయం చిన్నదిగా ఉండటం, పెచ్చులు ఊడుతుండంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో బయట చెట్ల కిందే కూర్చుంటున్నారు. దీంతోపాటు ప్రజామరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.



ఆలయ సందర్శనలో స్థపతి, అధికారులు, పాలకమండలి ప్రతినిధులు

అభివృద్ధి పనులపై నిపుణుల బృందం పరిశీలన

పాకాల, న్యూస్‌టుడే: మండలంలోని ఊట్లవారిపల్లి ఆనందగిరిపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి పరశురామేశ్వరప్ప, అధికారులు ఆదివారం సందర్శించారు. తితిదే, ప్రభుత్వ సహకారంతో చేపట్టబోయే అభివృద్ధి పనులపై స్థల పరిశీలన నిర్వహించారు. కార్యక్రమంలో ఆనందగిరి, తలకోన ఈవోలు యువరాణి, రవీంద్రరాజు, దేవాదాయశాఖ కాంట్రాక్టర్ సూరిబాబు, ఆలయ పాలకమండలి ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

తిరుచానూరు, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు (డీసీసీబీ) ప్రవేశపెట్టిన శ్రావణ సహకార డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ తిరుచానూరు మేనేజర్ లక్ష్మీదేవి ఒక ప్రకటనలో కోరారు. ఈ పథకం 456 రోజుల కాలపరిమితితో వచ్చేనెల 30 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. సాధారణ ప్రజలకు 7.60 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.20 శాతం వడ్డీ చెల్లిస్తామన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై రుణం పొందే సౌకర్యం అందుబాటులో ఉందని... వినియోగదారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపు నిచ్చారు.

అలరించిన దుర్యోధన వధ

చంద్రగిరి, న్యూస్‌టుడే: పంచమవేద మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ధర్మరాజులస్వామి ఆలయంలో స్వామి మూలవర్లకు అభిషేకాలు చేశారు. అనంతరం నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ఉభయదారులుగా రుద్రదేవారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, విరూపాక్షి హేమనారాయణరెడ్డి వ్యవహరించారు.

ఆగని ఏనుగుల దాడులు

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: మండలంలో ఏనుగుల దాడులు ఆగడం లేదు. ఇందులో భాగంగానే శనివారం రాత్రి చిట్టేచర్ల గ్రామాల్లోని నగరికి చెందిన వెంకట మునస్వామి, వీరస్వామికి చెందిన వరి పైరును ధ్వంసం చేశాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి (నగరం): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అలరించాయి. ఆదివారం తిరుపతికి చెందిన జ్ఞానదా కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో పలు సంస్కృతిక కార్యక్రమాలు, నృత్య, గాత్ర కచేరి ప్రదర్శనలు నిర్వహించారు. ఏవో ఖాదర్ వల్లీ, తితిదే సప్తగిరి ఎడిటర్ నరసింహాచార్యులు, సంస్కృత విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పన పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

తిరుపతి (విద్య): తిరుపతిలోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక అలిపిరి జూపార్కు మార్గంలోని అయాన్ డిజిటల్ కేంద్రం, కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. విద్యార్థులను ఉదయం ఏడు గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతించారు. ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించలేదు.

జనావాసాల్లోకి చుక్కల దుప్పి



చుక్కల దుప్పిని అడవిలో వదులుతున్న అటవీశాఖ అధికారులు

చంద్రగిరి గ్రామీణ: శేషాచల అటవీ ప్రాంతం నుంచి ఓ చుక్కల దుప్పి జనావాసాల్లోకి వచ్చిన ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. రంగంపేట పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న ఓ భవన నిర్మాణ గుంతలో పడటంతో పైకి రాలేకపోయింది. గమనించిన స్థానికులు అటవీ క్షేత్రాధికారి వెంకటరమణకు సమాచారం అందించారు. ఎఫ్‌బీవో రవి సిబ్బందితో అక్కడికి చేరుకుని దుప్పిని పట్టుకుని ప్రథమ చికిత్స చేశారు. కల్యాణి డ్యాం వెనుక ప్రాంతంలో దానిని వదిలేశారు. అటవీశాఖ బేస్ క్యాంపు సిబ్బంది శంకర్, సురేంద్ర, నవీన్, మునస్వామి పాల్గొన్నారు.

అతివల పొదుపు.. స్వావలంబన వైపు

☛ చిరు వ్యాపారాల్లో రాణిస్తూ పలువురికి ఆదర్శం

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో కుటుంబ అవసరాలు పెరిగిపోతున్నాయి. ఇంటి యజమానితో పాటు మహిళలు ఆర్థికంగా చేదోడువాదోడుగా నిలిస్తేనే కుటుంబం సాగుతుంది. దీన్ని గుర్తించిన సీఎం చంద్రబాబు మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. వెలుగు సంఘాల మహిళలను ఆర్థికంగా రాణించేలా సూచనలు, సలహాలు అందిస్తున్నారు. బ్యాంకు ద్వారా రుణాలు పొందిన మహిళలు చిన్నపాటి వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికవృద్ధి సాధిస్తున్నారు.

నెలకు రూ.20వేలు సంపాదిస్తూ



నా పేరు సుశీల, పాడిపేట గ్రామం. నాగాలమ్మ సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. సంఘంలో ఎలాంటి పూచికత్తు లేకుండా బ్యాంకు నుంచి రుణం, శ్రీనిధి, పొదుపు రుణం తీసుకున్నా. వెలుగు అధికారుల సూచనల మేరకు తిరుచానూరులో చెరకు రసం దుకాణం నిర్వహిస్తున్నా. నెలకు రూ.20 వేలు సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నా.

ఫ్లోర్ మిల్ నడుపుతూ...



మాది వేదాంతపురం అగ్రహారం. నా పేరు గంగ. సంఘంలో చేరిన అనంతరం ఇంటి వద్ద ఏదైనా వ్యాపారం చేయాలనే ఆలోచనతో మా కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న ఫ్లోర్‌మిల్‌ను ఇప్పుడు నేను నిర్వహిస్తున్నా. సంఘంలో బ్యాంకు నుంచి రుణం తీసుకుని మిల్‌లో పెట్టుబడిగా పెట్టా. ఖర్చులు పోనూ నెలకు రూ.20 వేలు వస్తున్నాయి.

టైలరింగ్ ద్వారా..



నా పేరు లహరి మాది దుర్గసముద్రం. సాయిసుధ పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. సంఘం ద్వారా రుణం తీసుకుని టైలరింగ్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నా. టైలరింగ్‌పై మహిళలకు ఆసక్తి పెరగడంతో ఆదరణ లభిస్తోంది. ఖర్చులు పోనూ నెలకు రూ.17 వేలు సంపాదిస్తూ ఒక ఇంటిని కూడా నిర్మించుకున్నా.

మెడికల్ ఫార్మసీ, ల్యాబ్ తోడుగా..



మాది దుర్గసముద్రం, నా పేరు కల్పన. శ్రీసాయినాథ సంఘంలో సభ్యురాలిగా చేరా. డ్వాక్రా సంఘంలో రుణం తీసుకుని అధికారుల సూచనల మేరకు తిరుపతిలో మందుల దుకాణం, ల్యాబ్ నిర్వహిస్తున్నా. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.25 వేలు ఆదాయం సమకూరుతోంది.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బస్సు.. ఇద్దరికి గాయాలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: నాగాలమ్మ మలుపు సమీపంలోని వంతెన వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. వేలూరు నుంచి తిరుపతికి వెళ్తున్న బస్సు ఢీకొంది. క్షతగాత్రులను తిరుపతిలోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించారు.



ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బస్సు

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

పొరుగు సేవకుడి తొలగింపు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పొరుగు సేవకుడిగా విధులు నిర్వర్తిస్తున్న రమేష్ అనుచితంగా ప్రవర్తించిన నేపథ్యంలో విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు ఆదివారం ఈవో వెంకటేశులు ఆదేశాలు జారీ చేశారు. కైలాసనదన్ మేనేజరుగా పనిచేస్తున్న రమేష్ విధి నిర్వహణలో ఆదివారం మద్యం తాగి, అతిథి గృహానికి బిరియానీ తీసుకువచ్చి తినడంతో పాటు అక్కడే వాంతులు చేసుకోవడంపై సిబ్బంది ఆలయ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ నిర్వహించిన ఈవో అతడిని విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీచేశారు. గతంలోనూ అతడిపై ఈ తరహా ఫిర్యాదులు రావడం గమనార్హం.

మురుగు.. వేసేదెలా అడుగు



సత్యవేడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కొమటిగుంట ఎస్సీ కాలనీలో కాలువలు లేకపోవడంతో రోడ్లపై నీరు నిలిచి అధ్వానంగా తయారైంది. తాగునీటి ట్యాంకు నుంచి వచ్చే నీరు, ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్లపై నిలిచి దోమలకు నిలయంగా మారింది. ఇటీవల కాలనీకి చెందిన ఓ వ్యక్తి డెంగీ జ్వరం బారినపడి ప్రైవేటు ఆసుపత్రిలో వేలకు వేలు ఖర్చు చేశాడు. మురుగు సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోయారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి శ్రీకాళహస్తిలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. పట్టణానికి సమీపంలోని సీఎస్ఎన్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన శాప్ మాజీ ఛైర్మన్ దివంగత పి.ఆర్.మోహన్ కుమార్తె వివాహానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా అధికారులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ముక్కంటి ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్ వినతి పత్రాన్ని అందజేశారు. * ఆశ్రమంలో ప్రస్తుతం నడుస్తున్న వివాదాలపై సమగ్ర విచారణ జరపాలని, ఆశ్రమ పవిత్రత కాపాడాలని వ్యాసాశ్రమ పరిరక్షణ కమిటీ సభ్యులు వినతిపత్రాన్ని అందించారు. * కేవీబీపురం మండలం కళత్తూరుకు చెందిన తెదేపా కార్యకర్త అప్పుల బాధతో మృతి చెందడంతో న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు విన్నవించారు.

ఆత్మీయ పలకరింపు: ఎంజీఎం ఆస్పత్రుల ఆవణలోని హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పలువురు నేతలు, జిల్లా అధికారులను ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ గోవిందరావు, ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి(శ్రీకాళహస్తి), కోనేటి ఆదిమూలం(సత్యవేడు), నెలవల విజయశ్రీ(సూళ్లూరుపేట), భానుప్రకాష్(నగరి), తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, తిరుపతి నగర కమిషనర్ జయకృష్ణ, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఆలయ ఈవో వెంకటేశులు, ముక్కంటి ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టేసాయిప్రసాద్, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్‌వర్మ, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు, ఉమ్మడి గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ ఆర్.గురవారెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు, రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య, కూటమి నేతలు చలపతినాయుడు, మునిరాజానాయుడు, చక్రధర్ తదితరులు ముఖ్యమంత్రిని కలిశారు.

వైభవంగా శ్రీ పేరంటాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



వరదయ్యపాళెం: మండలంలోని కోవూరుపాడులో నూతనంగా నిర్మించిన శ్రీ పేరంటాలమ్మ దేవాలయ మహా కుంభాభిషేకం ఉత్సవంలో భాగంగా ఆదివారం అమ్మవారి విగ్రహాన్ని ఆలయంలో వేదమంత్రాల నడుమ ప్రతిష్ఠించారు. అనంతరం పవిత్ర కలశ జలాలను ఆలయ గోపుర శిఖర కలశంపై అభిషేకించి మహా కుంభాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేష పుష్పాలతో అలంకరించారు. అమ్మవారికి పంచామృత, వివిధ సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత అమ్మవారి తొలి విశ్వరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. అమ్మవారికి సమర్పించిన నైవేద్యం భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సామర్ల హరి, భాస్కర్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పల్లెటూరి పిల్లలు.. క్రీడల్లో మెరికలు

న్యూస్‌టుడే, ఏర్పేడు

మండలంలోని పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. గత రెండేళ్లుగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకుంటున్నారు. రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 300మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పాఠశాలకు రెండు స్వర్ణ, ఒక వెండి పతకం దక్కడం విశేషం.

జాతీయ స్థాయిలో రాణిస్తా



గ్రాప్లింగ్, రెజ్లింగ్‌పై రెండేళ్ల వరకు ఎలాంటి అనుభవం లేదు. గత ఏడాది మా వ్యాయామ ఉపాధ్యాయురాలు దీనిపై ప్రత్యేక శిక్షణ కల్పించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది అండర్-13 బీచ్ గ్రాప్లింగ్‌లో 60కేజీల విభాగంలో ప్రతిభను చూపి రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాను. ఈ ఏడాది ఇటీవల జరిగిన అండర్-15 పోటీల్లోనూ బంగారు పతకాన్ని సాధించడం ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు పొందాలని ఉంది. **-దీపిక**

తొలిప్రయత్నంలోనే విజయం



నా తోటి విద్యార్థినులు క్రీడల్లో రాణిస్తుండటంతో నేను గ్రాప్లింగ్, రెజ్లింగ్‌పై ఆసక్తి చూపాను. మా తల్లిదండ్రులు సహకరించడంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచాను. 50కేజీల విభాగంలో రాణించడంతో సులభతరంగా బంగారు పతకాన్ని దక్కించుకున్నాను. జుడో, వాలీబాల్‌లోనూ శిక్షణ పొందుతున్నా. క్రీడా కోటాలో మంచి ఉద్యోగం సాధించాలన్నది నా లక్ష్యం. **-లతిక**

బరిలోకి దిగితే బహుమతే..



గత ఏడాది జరిగిన రాష్ట్ర స్థాయిలో ఎస్‌జీఎఫ్ అండర్-14 జుడోలో బ్రాంజ్ మెడల్ సాధించగా. గ్రాప్లింగ్‌లో బంగారు, బీచ్ గ్రాప్లింగ్‌లో వెండి పతకాన్ని సాధించాను. ఇటీవల జరిగిన పోటీల్లో 44 కేజీల విభాగంలో వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాను. ఇదే స్ఫూర్తితో రాణిస్తూ ఆదర్శంగా నిలవాలన్నదే నా ఆశయం. **-యామిని**

అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



పాఠశాలలో 300కి పైగా విద్యార్థులు ఉన్నారు. రెండేళ్లలో 50మందికి పైగా విద్యార్థినులు వివిధ ప్రాంతాల్లో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. వారిలో పది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించారు. మరింత మందిని జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.

- పుష్పవాణి, వ్యాయామ సంచాలకురాలు

సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో వివరించాలి



మాట్లాడుతున్న రూపానందరెడ్డి, పక్కన తెదేపా నాయకులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రాఘవరాజపురం వద్ద ఉన్న తెదేపా కార్యాలయంలో ఓబులవారిపల్లె మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల తరుణంలో ప్రతి పంచాయతీలోను కూటమి బలపరిచే అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని సూచించారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి విజయం సాధించేలా పనిచేయాలని చెప్పారు. పార్టీ నాయకులు సాయి వికాస్‌రెడ్డి, గునిపాటి చెన్నరాయుడు, చలపతి, నాగరాజు, సురేంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



రామసముద్రంలో కరపత్రాలు చూపుతున్న తెదేపా నాయకులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పుల్లంపేట, న్యూస్‌టుడే: అర్హులైన పేదలు అందరికి సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. ఆదివారం పలు గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తున్న ప్రభుత్వానికి అందరి అండదండలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవ ప్రాధాన్యంపై అవగాహన ఉండాలి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టపరమైన రక్షణపై అవగాహన కల్పించే ఆశయంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పౌరహక్కుల దినోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీవీఎంసీ సభ్యుడు గుత్తి త్యాగరాజు కోరారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం సత్యవేడు మండలం కదిరివేడు ఎస్సీ కాలనీ, బీఎన్‌కండ్రిగ మండలం అరిగలకండ్రిగ ఎస్టీ కాలనీ, వరదయ్యపాళెం మండలం మరదవాడ ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

నిరీక్షణ.. తప్పని యాతన

శ్రీకాళహస్తి ఆర్టీసీ ప్రాంగణమంతా ప్రయాణికులతో కిక్కిరిసింది. ఆదివారం సాధారణ ప్రయాణికులతో పాటు భక్తులు భారీగా బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే రద్దీకి సరిపడా అదనపు సర్వీసులు నడపక పోవడంతో ఇబ్బందులు పడుతూ గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వచ్చింది. వచ్చిన అరకొర బస్సుల్లోనూ సీట్ల కోసం ఫీట్లు చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇక్కడి నుంచి నెల్లూరుకు వెళ్లాల్సిన వారి పరిస్థితి దయనీయంగా మారింది. చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడ్డారు. బస్సు ఎక్కాలంటేనే పోరాడాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోయారు.

- న్యూస్‌టుడే, తొట్టంబేడు



ఆర్టీసీ ప్రాంగణంలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు



ధ్వజావరోహణ క్రతువులో వేదపండితులు

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలిసిన శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శాస్త్రోక్తంగా తీర్థవారి ధ్వజావరోహణం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణాలతో హోమ పూజలు చేపట్టారు. అనంతరం ధ్వజస్తంభానికి పూజలు చేపట్టి అవరోహణం చేశారు. దేవతామూర్తులను ఉత్సవర్లుగా తీర్చిదిద్ది చప్పరం వాహనసేవ చేపట్టారు. కార్యక్రమంలో జనార్ధన్‌శర్మ, అర్ధగిరి, సుబ్రహ్మణ్యంశర్మ, లక్ష్మయ్య, దుర్గాప్రసాద్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పంచాయతీల్లో శుభ్రత చర్యలు

రేణిగుంట, న్యూస్‌టుడే: మండలంలోని పంచాయతీల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో ఆదివారం ఈనాడులో 'పారిశుద్ధ్యం అధ్వానం.. స్పందించని యంత్రాంగం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు శుభ్రత చర్యలు చేపట్టారు. ప్రధానంగా రేణిగుంట పంచాయతీలోని బాలాజీ కాలనీలో అధ్వానంగా మురుగు పేరుకుపోయిన కాలువను దగ్గరుండి శుభ్రం చేయించారు.

నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: పిల్లలను నైతిక విలువలతో భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సంతవేలూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నాయకులు, వెంకటేష్‌ను సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ఎంఈవో సరస్వతి, సింగిల్‌విండో ఛైర్మన్ నందకిషోర్‌రెడ్డి, తెదేపా నాయకులు కరుణాకర్‌నాయుడు, దశరథన్ పాల్గొన్నారు.

కుంభాభిషేక మహోత్సవంలో ఎమ్మెల్యే

బీఎన్‌కండ్రిగ: కమ్మవారికండ్రిగ గ్రామంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకంలో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్నారు. తెదేపా మండల మాజీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, దాముడ్డి, కేవీబీపురం మండల నాయకులు గోపీనాథరెడ్డి, సురేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ✦ **నారాయణవనం:** విశ్రాంత ఉపాధ్యాయురాలు శాంతమ్మ సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. గోవిందప్పనాయుడు కండ్రిగలో నిర్వహించిన శుభస్వీకరణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే.. శాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభాకర్ బాబు యాదవ్, కందస్వామినాయుడు, జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

వేడుకగా చెల్లేతమ్మ ఊరేగింపు

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం గ్రామదేవత చెల్లేతమ్మ ఊరేగింపు ఆదివారం రాత్రి వేడుకగా జరిగింది. ఆవణి మాస ఆదివారం సందర్భంగా అమ్మవారికి ఆలయంలో ఉదయం విశేషాభిషేకాలు చేసి ఊయలసేవ నిర్వహించారు. రాత్రి ఆలయం నుంచి స్థానిక గాంధీ వీధిలో ఉన్న మండపానికి చెల్లేతమ్మను తీసుకువచ్చి సుందరంగా అలంకరించి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఏర్పాట్లను గ్రామపెద్దలు పర్యవేక్షించారు.



విశేషాలంకరణలో చెల్లేతమ్మ



మంతెన సత్యనారాయణరాజుతో ఆలయ అధికారులు

ముక్కంటి సేవలో మంతెన

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ యోగ, ప్రకృతి వైద్య సలహాదారులు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు వాయులింగేశ్వరుడిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి దర్శనార్థం వచ్చిన ఈయనకు ఆదివారం ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి, అమ్మవార్ల దర్శనం పూర్తయ్యాక ఈవో బి.కె.వెంకటేశులు స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలతో పాటు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, తనిఖీ అధికారి వెంకటస్వామి, అధికారులు పాల్గొన్నారు.

చేతికి అందివచ్చిన కుమారుడు అనంత లోకాలకు



నాని (పాత చిత్రం)

ఏర్పేడు: చేతికి అందివచ్చిన కుమారుడు ఊహించని రీతిన మృత్యువాత పడటంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం పాలైన విషాద ఘటన ఏర్పేడు మండలంలోని సదాశివపురం సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కందాడు ఎస్సీ కాలనీకి చెందిన రమణయ్య, పెంచులమ్మ దంపతులు కూలీలు. వీరి కుమారుడు నాని(20) రేణిగుంటలోని ఓ పెయింట్ గోదాములో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై అతడు ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో సదాశివపురం వద్ద వంతెన సమీపంలో కందాడు నుంచి గడ్డి లోడుతో తిరుపతి వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి అతడి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నాని అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనకు కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా



డ్రోన్ కెమెరాతో తీసిన అనంతసముద్రం చిత్రం

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండలంలో పోలీసులు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. అనంతసముద్రం పంచాయతీ వడ్డిపల్లె, అనంతసముద్రం, అగ్రహారం గ్రామాల్లో ఆదివారం డ్రోన్ కెమెరాలను వినియోగించి శివారు ప్రాంతాలు, నిర్మానుష ప్రదేశాలు, అనుమానాస్పద ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కోడి పందేలు, గంజాయి, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసుల సాధారణ నిఘాకు అందని ప్రాంతాలను సైతం పరిశీలిస్తూ, అనుమానాస్పద కదలికలు గుర్తించిన వెంటనే స్థానిక సిబ్బంది ద్వారా చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజల భాగస్వామ్యమే సమర్థ పోలీసింగ్‌కు బలమని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం కేవలం పోలీసుల బాధ్యతే కాదని, ప్రతి పౌరుడు తమవంతుగా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అప్పుడే గ్రామాలు సురక్షితంగా, ప్రశాంతంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

హోటల్‌లో పొగలు.. పరుగులు పెట్టిన ప్రజలు

రేణిగుంట, న్యూస్‌టుడే: స్థానిక చెక్‌పోస్టు కూడలిలో ఆదివారం చోటుచేసుకున్న స్వల్ప అగ్నిప్రమాదం స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేసింది. జామ్‌జామ్ హోటల్‌లోని కిచెన్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపు చేశారు. వినియోగదారులు పరుగులు తీశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


రేణిగుంట, న్యూస్‌టుడే: శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పదని పట్టణ ఎస్సై శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం రేణిగుంట పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. క్రమశిక్షణతో బాధ్యతగా జీవించాలని, నేరాలకు దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. తిరిగి నేరాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు.

పట్టుపట్టి.. చెట్టు కొమ్మలు పక్కకు నెట్టి

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీకాళహస్తి-తడ రహదారిపై లక్ష్మీపురం ఎస్టీ కాలనీ సమీపంలో ఆదివారం రోడ్డుపై చెట్టు కూలింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. సకాలంలో జేసీబీ యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో ఎస్సై హరిప్రసాద్ తన సిబ్బంది, స్థానికులతో కలిసి చెట్టు కొమ్మలు తొలగించి వాహనాల రాకపోకలకు సౌకర్యం కల్పించారు.

పసిఫిక్ ప్రభావం.. అరణియార్‌కు నీటి గండం

ఎల్‌నినోతో మూడో వంతుకు నిల్వలు



నీటి నిల్వ తగ్గి బయటకు కనిపిస్తున్న జలాశయం రివిట్‌మెంట్



20.7 అడుగులకు చేరిన నీటిమట్టం



జలకళ తగ్గిన అరణియార్ జలాశయం

పసిఫిక్ మహాసముద్ర ఉపరితలంపై పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం పిచ్చాటూరులోని అరణియార్ జలాశయంపై చూపింది. ఎల్‌నినో ధాటికి వర్షాలు తగ్గుముఖం పట్టడానికి తోడు ఎగువ నుంచి నీటి రాక సైతం కనిష్ఠ స్థాయికి దిగువన పంటల సాగుకు తూములోని నీటిని విడుదల చేస్తుండటంతో రోజుకో సెం.మీ. మేర నీటిమట్టం తగ్గుదల నమోదవుతోంది. 31 అడుగుల సామర్థ్యంతో 1.853 టీఎంసీల నీటిని నిల్వ ఉండే జలాశయంలో ప్రస్తుత నీటిమట్టం 20.7 అడుగులకు చేరింది. ఏటా అరణియార్‌లో ఆగస్టు నెలాఖరున మూడో వంతుకు పైబడి నీటి నిల్వలు ఉంటుండగా.. ఈ దఫా ఆ మోతాదు మూడో వంతుకు చేరింది. గత ఎనిమిదేళ్లుగా నవంబరు నాటికి పూర్తి స్థాయి నీటితో కళకళలాడిన జలాశయంలో ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా పడుతోందని ఏఈ ధరణీకుమార్ తెలిపారు. రైతులు నీటి లభ్యతను అనుసరించి పంట సాగులో మార్పులు చేసుకోవాలని ఆయన కోరారు. **-న్యూస్‌టుడే, నాగలాపురం**

సూళ్లూరుపేట

• సూళ్లూరుపేట • వెంకటగిరి

డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా నేడు

వెంకటగిరి: పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నైపుణ్యాభివృద్ధి, సీడాప్ ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ మేళాలో 15 బహుళ జాతి కంపెనీలు ముఖాముఖిలో పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, ఐటీఐ, డిప్లొమా కోర్సులు చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

వేడుకగా చెల్లేతమ్మ ఊరేగింపు

నాగలాపురం: నాగలాపురం గ్రామదేవత చెల్లేతమ్మ ఊరేగింపు ఆదివారం రాత్రి వేడుకగా జరిగింది. ఆవణి మాస ఆదివారం సందర్భంగా అమ్మవారికి ఆలయంలో ఉదయం విశేషాభిషేకాలు చేసి ఊయలసేవ నిర్వహించారు. ఏర్పాట్లను గ్రామపెద్దలు పర్యవేక్షించారు.

గూడూరులో నిమ్మ ధరలు



మొదటి రకం: కేజీ రూ. 110 నుంచి రూ. 160 వరకు
రెండో రకం: కిలో రూ. 70 నుంచి రూ. 110 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్ (రైతు ధర)	112
లేయర్	140
బ్రాయిలర్స్	208
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	230
లేయర్ మాంసం	238

వీఆర్‌కు కానిస్టేబుల్

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ శ్రీనివాసులును వీఆర్‌కు పంపారు. ఈయన ఎస్సై శివశంకర్‌తో దురుసుగా ప్రవర్తించడంతో స్థానిక సీఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు వీఆర్‌కు పంపారు.

ఘనంగా చెంచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

వెంకటగిరి, న్యూస్‌టుడే: మండలంలోని పారవోలు గ్రామంలో నూతనంగా నిర్మించిన చెంచమ్మ తల్లి ఆలయ కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేద పండితులు, గ్రామస్థుల సమక్షంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించి ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం హోమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేసి పూజలు చేపట్టారు. గ్రామంలోని మహిళలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

గణేష్ మండపానికి భూమి పూజ



గణేష్ మండపానికి శంకుస్థాపన చేస్తున్న తెదేపా నాయకులు రాజేష్, ఉత్సవ కమిటీ సభ్యులు

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో దర్గావీధిలో గణేష్ ఉత్సవాల నిర్వహణ మండపానికి ఆదివారం పట్టణ తెదేపా సీనియర్ నాయకుడు పి.రాజేష్ ఆధ్వర్యంలో యువకులు భూమి పూజ చేశారు. ఉత్సవాలకు పది రోజులు ముందు నుంచే హైదర్‌బాద్‌కు చెందిన కళాకారులతో మండపం, విగ్రహ ప్రతిష్ఠ రూపకల్పన చేస్తారు. ఇందులో భాగంగా శంకుస్థాపన పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పృధ్వీ, రమేష్, సత్య, బాబు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఏఎంసీ ఛైర్మన్



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం

వెంకటగిరి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును వెంకటగిరి మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ విశ్వనాథం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శ్రీకాళహస్తిలో శాప్ మాజీ ఛైర్మన్ పీఆర్ మోహన్ కుమార్తె వివాహానికి హాజరైన ముఖ్యమంత్రిని కలిసి మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

చెంగాళమ్మ ఆలయానికి రూ.1,01,116 విరాళం



కార్యనిర్వహణాధికారిణి ప్రసన్నలక్ష్మికి నగదును అందజేస్తున్న జుటేశ్వర్‌రావు, ఉమాదేవి దంపతులు

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదానానికి ఆదివారం హైదరాబాద్ వాస్తవ్యులు పీకే జుటేశ్వర్‌రావు, ఉమాదేవి దంపతులు రూ. 1,01,116 విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసన్నలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పాముూరు మునస్వామి, బాలసుబ్రహ్మణం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తెదేపా జిల్లా అధికార ప్రతినిధికి ఎమ్మెల్యే పరామర్శ



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని తిరుమూరు గ్రామంలో తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కుంచం దయాకర్ మాతృమూర్తి కుంచం మస్తానమ్మ మృతి చెందింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆదివారం మస్తానమ్మ మృతదేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దయాకర్‌ను ఓదార్చారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మధురెడ్డి, మైనార్టీ నేత గౌస్‌బాషా, చిట్టమూరు నేత దయాకర్‌రెడ్డి వాకాడు, కోట, చిట్టమూరు మండలాల నేతలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో లారీని ఢీకొట్టిన కారు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట మండలం మేనకూరు పంచాయతీ చలివేంద్రం వద్ద శనివారం రాత్రి మద్యం తాగి మత్తులో కారు డ్రైవరు అతివేగంతో రోడ్డుపై ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో వాహనాల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. మద్యం మత్తులో వాహనాన్ని నడిపిన కారుడ్రైవరు సురక్షితంగా బయట పడ్డారు. పోలీసులు రాత్రి సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పక్కకు తరలించారు.

నలుగురిపై కేసు

డక్కిలి, న్యూస్‌టుడే: ఆల్తూరుపాడులో చంద్రను గాయ పరిచారనే ఫిర్యాదు మేరకు కృష్ణయ్య మరో ముగ్గురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు. శనివారం ఈ ఘటన చోటు చేసుకున్నట్లు బాధితుడు పేర్కొన్నారన్నారు.

మేనకూరుసెజ్‌లో వ్యాపార సముదాయాలు



మేనకూరుసెజ్‌లో నిర్మిస్తున్న హోటళ్లు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: చిన్న, మధ్య తరహా కంపెనీలకు స్థలాలు కేటాయించినట్లుగానే వాణిజ్య పరమైన వ్యాపార సంస్థలకు స్థలాలను కేటాయిస్తున్నారు. పెద్ద పెద్ద హోటళ్లు, షాపింగ్ మాల్స్ ఇతర వ్యాపార సంస్థలను సెజ్ పరిధిలో నెలకొల్పేలా ప్రోత్సహిస్తున్నారు. ఏపీఐఐసీ అధికారులు వ్యాపార సంస్థలకు అనువైన రహదారులను ఆనుకుని చిన్న చిన్న విస్తీర్ణాల్లో భూములు కేటాయించేందుకు వ్యాపార సంస్థల యాజమాన్యాలతో మంతనాలు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు స్థలాలు పరిశీలించి నిబంధనల మేరకు కొనుగోలు చేస్తున్నారు.

■ నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ పరిధిలోని గ్రామాల్లో 4200 ఎకరాల్లో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు భూములు సేకరించారు. 2007సం నుంచి ఇక్కడ కంపెనీల నిర్మాణాలను చేపట్టారు. ఇటీవల కూటమి ప్రభుత్వ హయాంలో కొత్త కంపెనీల రాక పెరిగింది. పలుచోట్ల నిర్మాణాలు శరవేగంతో జరుగుతున్నాయి. మేనకూరు సెజ్ పరిసర ఓజిలి మండలంలోని గ్రామాల్లోనూ మరో 3700 ఎకరాల భూములను తాజాగా సేకరించే పనిలో రెవెన్యూ అధికారులు ఉన్నారు. ఈ క్రమంలో ఇక్కడి భూములకు డిమాండు పెరిగింది. సెజ్ పరిధిలోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో వాణిజ్య సంస్థలను స్థాపించేందుకు ఏపీఐఐసీ అధికారులు తక్కువ విస్తీర్ణంలో భూములు కేటాయించి అక్కడ వ్యాపార సంస్థలను స్థాపించేలా చర్యలు తీసుకుంటున్నారు. కొందరికి భూములు కేటాయించడంతో హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాల భవనాల నిర్మాణాలను చేపడుతున్నారు.

■ బయట ప్రాంతాలకు చెందిన వాళ్లు భూములను పరిశీలించి ఏపీఐఐసీ అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్నారు. మేనకూరు పరిసర ప్రాంతాల్లో భూములు, భవనాలకు డిమాండు ఏర్పడటంతో సెజ్ పరిధిలోని భూములను వ్యాపార సముదాయాలకు కేటాయిస్తున్నారు. స్థానిక మేనకూరు పంచాయతీ కార్యాలయం ఉన్నత పాఠశాల ఎదుట హోటళ్లను నిర్మించేందుకు భూములను చదును చేస్తున్నారు. కొన్నిచోట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. కంపెనీల మధ్యలోనూ రహదారులను ఆనుకుని 10 నుంచి 20 సెంట్ల మధ్య విస్తీర్ణంలోని స్థలాల్ని కేటాయిస్తున్నారు. పెట్రోలు బంకులు, హోటళ్లు, లాడ్జీలు, సూపర్ మార్కెట్, షాపింగ్ మాల్స్ వంటి వ్యాపార సంస్థలకు అవకాశం కల్పిస్తున్నారు.

ఎకరం రూ.96 లక్షలతో కేటాయింపు

సెజ్ పరిధిలోని అధికారులు సూచించిన చోట ఎకరం రూ.96 లక్షలతో కేటాయిస్తున్నారు. కేటాయించిన భూములకు ఇతర పన్నులతో కలిసి ఎకరం రూ.1.50 కోట్లు అయ్యే అవకాశముంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఏడేళ్ల గడువులో నగదు చెల్లించి వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సంస్థల వద్దకు నీరు, విద్యుత్తు, రోడ్లు, డ్రైనేజీ వంటి వసతులను కల్పించనున్నారు. ఇలా మౌలిక వసతుల కల్పన జరగడంతో వ్యాపార సంస్థలను స్థాపించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966

బాలాయపల్లి, న్యూస్‌టుడే: **సమస్య:** వెంకటగిరి-గూడూరు మార్గం అక్కసముద్రం బస్‌షెల్టర్‌లో చెత్తా చెదారం చేరి ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది. - **బాబు**

సమాధానం : శుభ్రం చేయిస్తాం. - **దయాకర్, స్వర్ణ గ్రామ కార్యదర్శి, వెంగమాంబాపురం**

సమస్య: పిగిలాం పంచాయతీ జార్లపాడు తూర్పువీధిలో బోరు మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారింది. - **రమేష్**

సమాధానం: మరమ్మతులు చేయించి వాడుకలోకి తెస్తాం. - **రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో**

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: **సమస్య:** సూళ్లూరుపేట మండలం కొల్లపట్టు గ్రామంలో డ్రైనేజీ కాలువ సక్రమంగా లేక పోవడంతో మురుగు ముందుకు సాగడంలేదు. దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. - **స్థానికుడు**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- వెంటేశ్వరరావు, ఎంపీడీవో

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని కట్టెలవీధి మార్గంలోని సైడు కాలువలు దెబ్బతిన్నాయి. కాలువలో వ్యర్థాలతో మురుగు ముందుకు సాగడంలేదు.
- చంద్ర, వెంకటగిరి

సమాధానం: కాలువలో పూడికతీత పనులు చేపడతాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి కాలువను నిర్మిస్తాం. - **రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

ముచ్చలగుంటలో ఎమ్మెల్యే పర్యటన నేడు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండలంలోని నెల్లూరుపల్లి పంచాయతీ ముచ్చలగుంటలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పర్యటించనున్నారు. రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని మండల తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఆదివారం దొరవారిసత్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి వర్ల దేవదాస్‌మాదిగ, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి కుక్కమల్లు రవిమాదిగ, దొరవారిసత్రం మండల ఇన్‌ఛార్జి కంటేపల్లి నాగేశ్వరరావుమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా మొండెం మునికృష్ణమాదిగను, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న జనసేన నాయకులు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం ముందస్తు వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద జనసేన పార్టీ నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. నోవా బ్లడ్ బ్యాంక్ సహకారంతో జనసేన నాయకులు ఎంబేటి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనసేన నాయకులు షేక్ బాషా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు యువత రక్తదానం చేశారు. జనసేన నాయకులు ఆవుల దాస్, సుజాత, కల్యాణ్, సనత్‌కుమార్, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు చేయూత

వెంకటగిరి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు కాపు బలిజ తెలగ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక చేయూతను అందించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు మణి తెలిపారు. ఆదివారం వైద్యశాల ప్రాంగణంలో పద్మావతికి రూ.11వేలు, పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో కాపు, బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ గోపాల్, ప్రధాన కార్యదర్శి గుండు మనోజ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, సభ్యులు రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.35 కోట్లతో పెంచలకోన ఆలయ అభివృద్ధి



బాలాలయానికి తరలిస్తున్న కలశాలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని రూ.35కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆదిలక్ష్మి అమ్మవారి బాలాలయంలో కలశ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా ఆలయ అభివృద్ధికి రూ.6.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రధాన ఆలయంలో అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రానైట్ రాళ్లు అమర్చనున్నట్లు తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. పెనుశిల క్షేత్రానికి వచ్చే మార్గంలో తన సొంత నిధులు రూ.కోటితో ఆలయ ముఖ ద్వారం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు అన్నదాన సత్రంలో భోజన వసతులు, కూరగాయలు, వంట సామగ్రిని పరిశీలించారు. బాలాలయంలో అమ్మవారి రూప ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణ, సింధు దంపతులు పాల్గొన్నారు.

వేలాడుతున్న తీగలు

నాయుడుపేట బాలాజీ గ్రీన్ సిటీ ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. మూడు వైపులా తీగల సాయంతో నిలబడింది. స్తంభాలకు అమర్చిన తీగలు నేలకు దగ్గర్లో వేలాడుతున్నాయి. ప్రజలు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది. వీటిని సరి చేయాల్సి ఉంది. - **న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం**



గేట్లున్నా ఉపయోగంలో లేవు



సూళ్లూరుపేట మండలంలోని మంగానెల్లూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ గేట్లు దెబ్బతిన్నాయి. పాఠశాల ఆవరణలోకి పశువులు విచ్చల విడిగా వచ్చి చెట్లను పాడు చేస్తున్నాయి. గేట్లు లేక పోవడంతో రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు స్థావరంగా మారుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. తలుపులు, ఇతర సామగ్రి దెబ్బతినే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రహరీ గేట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం**

రహదార్లపై వాహనాలు.. ప్రమాదాలకు నిలయాలు



జాతీయ రహదారిపై ఆగివున్న లారీలు

ఓజిలి, న్యూస్‌టుడే: జాతీయ రహదార్లపై వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా నిలపడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. నిబంధనల మేరకు జాతీయ రహదార్లపై వాహనాలను అధికారులు ఏర్పాటు చేసిన విశ్రాంతి స్థలంలోనే నిలపాల్సి ఉంది. వాహనదారులు మాత్రం నిబంధనలు పాటించక ఇష్టారాజ్యంగా చోట్ల అడ్డుగోలుగా నిలుపుతున్నారు. పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

■ నియోజకవర్గంలోని ఓజిలి, నాయుడుపేట, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ, మండలాల మీదుగా ఉన్న 16వ నెంబర్ జాతీయ రహదారిపై విచ్చలవిడిగా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా రహదార్ల సమీపంలోని పెట్రోలు బంకులు, డాబాల వద్ద రాత్రి సమయంలో వాహనాలు నిలపడంతో అతివేగంగా వస్తున్న వాహనాలు ఢీ కొంటున్నాయి. తరచూ చోటు చేసుకుంటున్న ఇలాంటి ప్రమాదాల్లో పలువురు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి.

■ పెళ్లకూరు మండలం పెసల గుర్రప్పశెట్టితోట సమీపంలో జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని కర్ణాటక ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొనడంతో 15 మంది గాయ పడిన విషయం తెలిసిందే. జాతీయ రహదార్లపై పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రమాదాలు నియంత్రించాల్సి ఉండగా ఆదిశగా చర్యలు తీసుకోవడంలేదని వాహన దారులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రహదార్లపై వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకోవాలని పలువురు వాహన దారులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలిసిన శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీనీలకంఠేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శాస్త్రోక్తంగా తీర్థవారి ధ్వజావరోహణం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో హోమ పూజలు చేపట్టారు. అనంతరం ధ్వజస్తంభానికి పూజలు చేపట్టి అవరోహణం చేశారు. దేవతామూర్తులను ఉత్సవర్లుగా తీర్చిదిద్ది చప్పరం వాహనసేవ చేపట్టారు. కార్యక్రమంలో జనార్ధన్‌శర్మ, అర్ధగిరి, సుబ్రహ్మణ్యంశర్మ, లక్ష్మయ్య, దుర్గాప్రసాద్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఇటా ఉంటే తిప్పలే



నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు నుంచి శ్రీకాళహస్తి రోడ్డు పొడవునా పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు వరకూ జాతీయ రహదారిపై వాహనాలు నిలిపి ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వ్యాపార దుకాణాలు, మెకానిక్ షెడ్లు, పెట్రోలు బంకులు, ధాన్యం తూకం వేసే యంత్రాలు, డాబాలు, హోటళ్ల వద్ద వాహనాలు నిలుపుతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు సమస్యగా మారింది.

- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

బాలిక అదృశ్యం

బాలాయపల్లి, న్యూస్‌టుడే: మండలంలో బాలిక అదృశ్యం కావడంతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మాల్యాద్రి తెలిపారు. శనివారం ఇంటి నుంచి బ్యాంకు వద్దకు కెళ్తనట్లు చెప్పి తిరిగి రాలేదని బాలిక తండ్రి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు అంచుల్లో రంధ్రాలు.. అవస్థల్లో ప్రజలు



నాయుడుపేట అంకమ్మగుడి వీధి నుంచి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లే మలుపులో ఇరువైపులా సైడుకాల్వలు, రోడ్డు దెబ్బతిని రంధ్రాలు ఏర్పడ్డాయి. ఇవి రాకపోకలకు అంతరాయంగా మారుతున్నాయి. కొన్నేళ్లుగా ఇలా ఉన్నా పురపాలక సంఘ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎంతో మంది ఈ మలుపు రంధ్రాల్లో పడి గాయాల పాలవుతున్నారు. వాహనాలు తిరిగేందుకు తిప్పలు పడుతున్నాయి. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

అంచుల్లో దాగి ఉన్న ప్రమాదం

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: దొరవారిసత్రం నుంచి పూలతోటకు వెళ్లే ర.భ రహదారి ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా అటవీ ప్రాంతంలో సుమారు మూడు కిలోమీటర్లు గుంతలు పడ్డాయి. దీనికి తోడు అంచులు పూర్తిగా కోతకు గురై దెబ్బతిన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు అంచుల్లోకిదిగి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ రహదారి మరమ్మతులకు కూటమి ప్రభుత్వం సుమారు రూ.రెండు కోట్ల నిధులు మంజూరు చేసింది. నెలలు గడుస్తున్నా పనులు ప్రాంభం కాలేదు. పనులు దక్కించుకున్న గుత్తేదారు కొన్ని నెలల క్రితం జేసీబీతో అక్కడక్కడ గుంతలు చదును చేసి వదిలేశారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే పది గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.



పట్టణాలైనా ప్రగతి శూన్యం

నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణం, వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంతాల్లోని పక్కారోడ్లు అధ్వానంగా మారాయి. పురపాలక సంఘాలకు ఏటా కోట్లల్లో రాబడి వస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. పురపాలక అధికారులు, పాలకులు తమ లాభానికి ప్రైవేటు లేఅవుట్లు, అపార్టు మెంట్లున్న ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాన్ని చేపడుతున్నారు. నిరుపేదలు, మధ్య తరగతి కుటుంబాలు నివశించే ప్రాంతాల్లో పక్కారోడ్లను అభివృద్ధి చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. పీజీఆర్ఎస్, ప్రజాదర్బార్ వంటి కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేదు.



దుస్థితిలో సూళ్లూరుపేట డెకపాళెం కాలనీ రోడ్డు

రాకపోకలకు నరకయాతన

పట్టణాల్లో పలు వీధుల్లో పక్కారోడ్డు వసతి లేక చిన్నపాటి వర్షం కురిస్తే స్థానికులు రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. వాహనాలు దూరంగా ఉన్న ప్రధాన రోడ్డుపై ఉంచి అక్కడ నుంచి కాలినడకన ఇళ్లకు చేరాల్సి వస్తోంది. కొన్ని ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరిగే అవకాశమూలేదు. రోడ్లు ఎత్తు పల్లాలుగా ఉండడంతో రోజులు తరబడి వీధుల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

ఏళ్ల తరబడి ఇదేతీరు

నాయుడుపేట పట్టణంలో లక్ష్మణ్‌నగర్, పాగగొట్టం, జైహింద్‌కాలనీ, టీచర్స్‌కాలనీ, శ్రీరామ్‌నగర్, అమరగార్డెన్ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టలేదు. 20 సంవత్సరాలుగా ఇక్కడ రోడ్డు నిర్మించాలని వినతి పత్రాలు సమర్పించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల పట్టణంలో రూ.10 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. ఎక్కువగా గుత్తేదారులకు అనుకూలంగా ఉండేవిధంగా అపార్టుమెంట్‌లు, లేఅవుట్లు ఉన్న ప్రాంతాల్లో నిర్మించారన్న విమర్శలు ఉన్నాయి.

వీధుల్లో నరకం: సూళ్లూరుపేట పట్టణ పరిధిలో మన్నారుపోలూరు న్యూకాలనీ, వటపాళెం, సోనియగాంధీనగర్, డేగలపాళెం ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించలేదు. ఏళ్ల తరబడి స్థానికులు మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వర్షాకాలంలో విద్యార్థులు పాఠశాలలకు బురదరోడ్లలోనే వెళ్లాల్సి వస్తోంది. ఎక్కడ నీరు అక్కడ నిలిచి వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి.

అధ్వానంగా రహదారులు

వెంకటగిరి పురపాలిక సంఘ పరిధిలో ఎపీటీఎఫ్, పెరియవరం, ఏకలవ్యనగర్, కుమ్మరిమిట్ట, సాలికాలనీల్లో రహమత్‌నగర్ ప్రాంతాల్లో పక్కారోడ్ల నిర్మాణాన్ని చేపట్టలేదు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. 2009 నుంచి ఈ ప్రాంత ప్రజలు రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పిస్తున్నా స్పందన లేదని వాపోతున్నారు.